## ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపే లక్ష్యం

అమరావతి, అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సోదర సోదరీమణులకు ఏపీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో చేపట్టే కార్యక్రమాలపై వారితో చర్చించి నేడు నిర్ణయాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మంత్రి లోకేశ్ గిరిజనులకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసుల సొంతమన్నారు. కూటమి ప్రభుత్వంలో వారి సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.7,557 కోట్ల నిధులు విడుదల చేసినట్లు- వివరించారు. భవిష్యత్‌లోనూ వారికి అన్నివిధాలా అండగా నిలుస్తామన్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :144 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 10-08-2025 | పేజీలు:4 వెల: 2.00


## భారత్ విమానాలకు గగనతలం మూసివేత.. రెండు నెలల్లోనే పాక్‌కు రూ.400 కోట్ల నష్టం



న్యూఢిల్లీ, పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ పై భారత్ పలు ఆంక్షలు విధించింది. అందుకు ప్రతిగా పాక్ సైతం భారత్‌ను దెబ్బతీయాలనే దురుద్దేశంతో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే ఆ నిర్ణయాల వల్ల పాక్‌కు భారీగా నష్టం వాటిల్లినట్లు తెలిసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ విధించిన ఆంక్షలకు ప్రతీకారంగా భారత్ నుంచి వచ్చే విమానాలకు ఆ దేశం తన గగనతలాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 24 నుంచి భారత విమానాలకు తన గగనతలాన్ని మూసివేసింది. ఈ నిషేధం ఇప్పటికీ ఇంకా కొనసాగుతోంది. అయితే, ఈ నిర్ణయం కారణంగా ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 మధ్య పాకిస్థాన్ ఎయిర్ పోర్ట్స్ అథారిటీకి రూ.4.10 బిలియన్ల నష్టం (భారత కరెన్సీలో రూ.410 కోట్లు) వాటిల్లింది. ఈ విషయాన్ని పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ అక్కడి అసెంబ్లీలో వెల్లడించినట్లు డాన్ నివేదించింది. పాక్ ఆంక్షల ప్రభావం రోజుకు 100 నుంచి 150 భారత్‌కు చెందిన విమానాలపై పడింది. దీని ఫలితంగా మొత్తం విమాన రాకపోకల్లో 20 శాతం తగ్గుదల నమోదైంది. దీంతో అధిక ఛార్జీల నుంచి ఆదాయం తగ్గినట్లు పాక్ మంత్రి అసెంబ్లీకి వివరించినట్లు డాన్ పేర్కొంది. ఈ నిర్ణయంతో రెండు నెలల్లోనే దాదాపు రూ.4.10 బిలయన్ల నష్టం వాటిల్లినట్లు తెలిపింది.

పాక్ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం..

విమానాలు ఒక దేశ గగనతలం మీదుగా ప్రయాణించినప్పుడు ఆ దేశానికి 'ఓవర్‌ఫ్లైట్ ఫీజులు' చెల్లించాల్సి ఉంటుంది. పశ్చిమ దేశాలకు వెళ్లే భారత విమానాలు ఎక్కువగా పాకిస్థాన్ గగనతలాన్ని ఉపయోగిస్తుంటాయి. పాక్ గగనతలాన్ని వినియోగించుకున్నందుకు ఏటా మిలియన్ల డాలర్లు ఆ దేశానికి ఓవర్‌ఫ్లైట్ ఫీజుల కింద చెల్లిస్తుంటాయి. దీని ద్వారా పాక్‌కు ఏటా కోట్లాది డాలర్ల ఆదాయం సమకూరేది. తాజా ఆంక్షల వల్ల పాక్‌కు ఈ ఆదాయం నిలిచిపోయింది. దీని ప్రభావం పాక్ ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా ఉంటుందని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. పాకిస్థాన్ ఇలా భారత్ నుంచి వచ్చే విమానాలకు తన గగనతలాన్ని మూసివేయడం ఇదేమీ మొదటిసారి కాదు. జూలై 2019లో పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసింది. అప్పుడు దాదాపు 400 విమానాల రాకపోకలపై ప్రభావం పడింది. ఫలితంగా పాక్ 100 మిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసింది. ప్రస్తుత చర్యతో పాక్ మరోసారి అలాంటి నష్టాలనే ఎదుర్కోవాల్సి వచ్చింది. పలు నివేదికల ప్రకారం.. పాకిస్థాన్ గగనతలం మీదుగా ప్రయాణించే బోయింగ్ 737 విమానాలు ఓవర్‌ఫ్లైట్ ఫీజుగా దాదాపు 580 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పెద్ద విమానాలకు ఈ ఫీజులు ఇంకా ఎక్కువగానే ఉంటాయి. తాజా నిర్ణయంతో ఓవర్ ఫ్లైట్ ఛార్జీల ద్వారానే పాకిస్థాన్ ప్రతిరోజూ దాదాపు %వి%232,000 మేర నష్టపోతోందని అంచనా. దీనికి తోడు ల్యాండింగ్, పార్కింగ్ వంటి ఇతర ఛార్జీలతో కలిపి రోజువారీ నష్టం దాదాపు %వి%300,000 వరకూ ఉంటుందని అంచనా.

## రాజ్యాంగం మార్చాలన్న కుట్రలో బిజెపి...

హైదరాబాద్,ఆగస్టు9: రాజ్యాంగం మార్చాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బిజెపి చర్యలన్నీ ఈ కోవలో భాగంగానే సాగుతున్నాయని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. క్విట్ బిజెపి నినాదంతోనే దేశానికి రక్ష అన్నారు. అలాగే.. ఎలక్షన్ కమిషన్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమం ఏ విధంగా జరిగిందో నేటి యువత తెలుసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. 1942లో బ్రిటీ-ష్ పాలకులను తరిమి కొట్టాలని అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైనదని ఉద్ఘాటించారు. డూ ఆర్ డై నినాదంతో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం చేశారని కొనియాడారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ.. కాంగ్రెస్ చరిత్రను తుడిచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్.. నెహ్రూ, సర్దార్, సుభాష్ చంద్రబోస్ లాంటి నేతలను చరిత్రలో లేకుండా చేద్దామని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.



స్వతంత్ర సంస్థలను వాడుకొని ప్రతిపక్షాలపై మోదీ ప్రభుత్వం కుట్ర పూరిత దాడి చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎలక్షన్ కమిషన్.. బీజేపీ ఫ్రంటల్ ఆర్గనేషన్‌గా మారిందని ఆక్షేపించారు. ప్రశ్నిస్తే దేశ ద్రోహుల ముద్ర వేస్తున్నారని దుయ్యబట్టారు. క్విట్ బీజేపీ అంటేనే దేశానికి భవిష్యత్తు అని ఉద్ఘాటించారు. కులాలు, మతాల పేరిట బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేస్తోందని విమర్శించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక్కరంటే ఒక్కరూ కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు లేరని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ దేశ స్వాతంత్ర్య కోసం ఉద్యమం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఈ దేశ రక్షణ కోసం పని చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌లో ఐదు పాక్ యుద్ధ విమానాలను కూల్చేశాం




న్యూఢిల్లీ, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్ సమయంలో ఐదు పాక్ యుద్ధ విమానాలను కూల్చేసినట్లు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తాజాగా వెల్లడించింది. వాటితోపాటు రెండు వైమానిక స్థావరాలను కూడా ధ్వంసం చేసినట్లు ఎయిర్ ఫోర్స్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తాజాగా వెల్లడించారు. బెంగళూరులో ఎయిర్ మార్షల్ కాత్రే వార్షిక వేడుకలో పాల్గొన్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఈ సందర్భంగా మాట్లాడారు. 'పక్కా ప్రణాళికతో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. ఈ ఆపరేషన్‌తో పాక్‌కు స్పష్టమైన సందేశాన్నిచ్చాం. సిందూర్ సమయంలో పాక్‌కు చెందిన ఐదు ఫైటర్‌జెట్స్‌ను కూల్చేశాం. వాటితోపాటు ఓ పెద్ద విమానాన్ని కూడా కూల్చేశాం. రెండు వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాం. మన S-400 రక్షణ వ్యవస్థ, డ్రోన్ వ్యవస్థలు సమర్థవంతంగా పని చేశాయి' అని ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఏపీ సింగ్ తెలిపారు. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా భారత్ చేపట్టిన ఆపరేషన్‌లో పాక్‌లోని బహవల్‌పూర్‌లో గల జైషే ఉగ్రసంస్థ ధ్వంసమైన ఫొటోలను కూడా ప్రదర్శించారు. దాడికి ముందు దాడి తర్వాత దృశ్యాలను మీడియాకు చూపించారు. పహల్గాం ఉగ్రదాడిలో భారత ఆడపడుచుల సిందూరాన్ని తుడిచేసిన ముష్కర మూకలకు 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం గట్టిగా బదులిచ్చింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని తొమ్మిది ఉగ్ర శిబిరాలపై అత్యంత కచ్చితత్వంతో మెరుపు దాడులు చేసింది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల లోపు దూరంలో జరిగిన ఈ దాడుల్లో 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. 1971 యుద్ధం తర్వాత త్రివిధ దళాలు సంయుక్తంగా నిర్వహించిన అతిపెద్ద జాయింట్ ఆపరేషన్ ఇదే.

## కేటీఆర్‌కు బండి సంజయ్ సవాల్..

కరీంనగర్: తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను మాజీ మంత్రి కేటీఆర్.. ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై ప్రమాణానికి సిద్ధమని.. ఏ గుడికి రమ్మంటారో కేటీఆర్ టైమ్, డేట్ చెప్పాలని బండి సంజయ్ సవాల్ విసిరారు. కేంద్రమంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నీకు నేను రక్ష.. నాకు నువ్వు రక్ష అని స్నేహంలో ఉన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను బీఆర్ఎస్ ప్రశ్నించడం లేదు. కేటీఆర్ సోదరి కవితనే.. తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌పై నేను ప్రమాణానికి సిద్ధం. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని కేటీఆర్ ప్రమాణం చేస్తాడా?. నా సవాల్‌కు కేటీఆర్ సిద్ధమా?. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు బీఆర్ఎస్‌ను వదిలేసి బయటికి రావాలి. కాళేశ్వరం రిపోర్ట్ వచ్చాక ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అని ప్రశ్నించారు. సిట్ అధికారులకి నా దగ్గర ఉన్న ఆధారాలు ఇచ్చాను. సిట్ అధికారులు నిజాయితీపరులు. కానీ పరిమితులు తక్కువగా ఉన్నాయి. కానీ ప్రభుత్వంపై నమ్మకం లేదు. ఫోన్ ట్యాపింగ్ విచారణను సీబీఐకి అప్పగించండి. దాదాపు ఆరు వేలకు పైగా ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయి. ప్రభాకర్ రావు ఐజీ అని తప్పుడు సమాచారం కేంద్రానికి ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని ఆయనను విచారణకి పిలుస్తారా?. ఎస్ఐబీ దేని కొసం పనిచేయాలి.. కేవలం మావోయిస్టుల కోసం పని చేయాలి. మావోయిస్టు సానుభూతిపరులుగా మా పేర్లు పోలీసులకు పంపారు. ఇలా ఫోన్లు ట్యాపింగ్ చేస్తారా?. హరీష్ రావు, కవిత ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయి. వారిని కూడా విచారణకి పిలవాలి అని వ్యాఖ్యలు చేశారు.



## రష్యా ఉప ప్రధానితో అజిత్ దోవల్ భేటీ..

న్యూఢిల్లీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యా పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన దోవల్.. తాజాగా ఆ దేశ ఉప ప్రధాని డెనిస్ మంతురోవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిలిటరీ-సాంకేతిక ఒప్పందాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపినట్లు రష్యా రాయబార కార్యాలయం ప్రకటించింది. పౌర విమానాల తయారీ, రసాయన పరిశ్రమ సహా ఇతర వ్యూహాత్మక రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల పురోగతిని ఇరుపక్షాలు సమీక్షించినట్లు పేర్కొంది. కాగా, ఈనెల 7న పుతిన్‌తో దోవల్ భేటీ అయిన విషయం తెలిసిందే. క్రెమ్లిన్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశంలో రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షోయిగు, క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషకోవ్ పాల్గొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లతో భారత్‌పై అమెరికా అధిక సుంకాలు వధించిన వేళ దోవల్ మాస్కో పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.

పుతిన్‌తో మోదీ ఫోన్ సంభాషణ..

మరోవైపు రష్యా అధినేత పుతిన్‌తో ప్రధాని ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో స్వదేశంలో భారత్, రష్యా 23వ వార్షిక సమావేశం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన మోదీ.. ఉక్రెయిన్ యుద్ధం పురోగతి విషయమై రష్యా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. 'స్నేహితుడు పుతిన్‌తో సంభాషణ సమగ్రంగా, ఉపయుక్తంగా సాగింది. ఉక్రెయిన్ యుద్ధం తాజా అప్‌డేట్స్ విషయంలో ఆయనకు ఫోన్‌లోనే ధన్యవాదాలు తెలియజేశాను. భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై కూడా ఇద్దరం చర్చించాం. అంతేకాదు రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే విషయంలో కట్టుబడి ఉన్నామని పుతిన్‌తో చెప్పాను. ఈ ఏడాది చివర్లో పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించనున్నాను' అని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మరోసారి భారత్ తటస్థ వైఖరిని మోదీ స్పష్టం చేశారు. ఇరు దేశాధినేతలు చర్చించుకొని.. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.



ఏడాది చివరిలో భారత్‌కు పుతిన్

పుతిన్ ఈ ఏడాది చివరిలో భారత్‌ను సందర్శించనున్నారు. ప్రస్తుతం ఆయన పర్యటన తేదీలను ఖరారు చేస్తున్నట్లు మాస్కో పర్యటనలో ఉన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ గురువారం వెల్లడించారు. రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయ్‌గుతో సమావేశమైన ధోవల్ త్వరలో జరగనున్న పుతిన్ భారత పర్యటనపై భారత ప్రభుత్వం ఎంతో ఆసక్తిగా, ఆనందంగా ఉందని చెప్పారు.

## తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు



హైదరాబాద్,: స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కావాలనే బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ(శనివారం) మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, వారి సోదరులకు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీతక్కకు మంత్రి పొన్నం చీరను బహూకరించారు. సీతక్క నుంచి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సీతక్కకు పొన్నం ప్రభాకర్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాఖీ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోదరి సీతక్క అంటూ ఆత్మీయంగా పలకరించి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుకి మంథని నియోజకవర్గ మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## రాహుల్‌గాంధీ విందులో ఉద్ధవ్ థాక్రేకు అవమానం..

న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన విందులో ఉద్ధవ్ థాక్రే, ఆయన కుమారుడు ఆదిత్య థాక్రేకు అవమానం జరిగిందంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆరోపించారు. రాహుల్‌గాంధీ విందులో ఉద్ధవ్, ఆదిత్యకు చివరి సీటులో కూర్చోబెట్టారని విమర్శించారు. ఎన్డీఏలో ఉన్నప్పుడు ఎప్పుడూ ముందు వరుసలో కూర్చునేవారిని గుర్తుచేశారు. ఉద్ధవ్ థాక్రే ఎప్పుడూ ఢిల్లీ ముందు తలవంచకూడదని మాట్లాడేవారని.. ఇప్పుడేమో ఇండియా కూటమిలో పరిస్థితి మారిపోయిందని ఫడ్నవీస్ పేర్కొన్నారు. అయితే దేవేంద్ర ఫడ్నవిస్ చేసిన ఆరోపణలను సంజయ్ రౌత్ ఖండించారు. టీవీ స్క్రీన్ బాగా చూడటం కోసమే చివరి వరుసలో కూర్చున్నట్లు సంజయ్ రౌత్ తెలిపారు. వాస్తవానికి రాహుల్ విందులో ముందు కూర్చున్నట్లు తెలిపారు. ఓట్ల కుట్రపై రాహుల్ గాంధీ ప్రజెంటేషన్ ఇస్తున్నారని.. టీవీ స్క్రీన్ కళ్లకు నొప్పిగా ఉండడంతో వెనక్కి వెళ్లి కూర్చున్నట్లు పేర్కొన్నారు. ఉద్ధవ్ థాక్రే.. సోనియా, రాహుల్‌తో ఎలా మసులుకున్నారో ఇతర ఫొటోలు చూడాలని పేర్కొన్నారు. బీజేపీ కుట్రలు గురించి రాహుల్ గాంధీ మాట్లాడుతుంటే.. సీట్ల గురించి మాట్లాడుతూ చర్చను పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. 2022లో కాంగ్రెస్ మద్దతుతో మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఉద్ధవ్ థాక్రే ముఖ్యమంత్రి అయ్యారు. అనంతరం ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు చేసి బీజేపీ మద్దతుతో ముఖ్యమంత్రి అయ్యారు. ఇక గతేడాది జరిగిన ఎన్నికల్లో బీజేపీ సంపూర్ణ మెజార్టీ రావడంతో తిరిగి బీజేపీ నుంచి ఫడ్నవిస్ ముఖ్యమంత్రి అయ్యారు.



## ఖైదీలకు రాఖీలు కట్టిన హోం మంత్రి అనిత..



అమరావతి,రాఖీ పౌర్ణమి సందర్భంగా విశాఖ కేంద్ర కారాగారానికి ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెళ్లారు. ఈ సందర్భంగా యువ ఖైదీలైన 30 మందితో పాటు జైళ్లశాఖ అధికారులకు సైతం రాఖీలు కట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంజాయి రవాణాలో పట్టుబడిన ఖైదీలకు అవగాహన కల్పించాం.. యువత మంచి, చెడులను తెలుసుకోవాలని సూచించింది. తెలిసి తెలియని వయస్సులో ఈజీమనీ కోసం ఆలోచిస్తే, జీవితాలు నాశనం అయిపోతాయని వెల్లడించింది. తమ బంగారు భవిష్యత్ ను యువత నాశనం చేసుకోకండి అని హోంశాఖ మంత్రి అనిత పిలుపునిచ్చింది. ఇక, ఖైదీల జీవితాల్లో మార్పు రావాలి అని మంత్రి అనిత పేర్కొనింది. బ్రతకడానికి చాలా అవకాశాలు ఉన్నాయి.. రాష్ట్రంలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం.. వచ్చే సంవత్సరం మీరంతా మీ ఇంటి దగ్గర రాఖీపౌర్ణమి జరుపుకోవాలి అని కోరింది. తప్పుడు పనులు చేసి జైలుకు రావొద్దని తెలిపింది.

## సంపాదకీయం

ఆదివారం 10-08-2025

# స్వామినాథన్ సూచనలకు విలువేదీ?

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ శతజయంతి జరుపుకుంటున్న వేళ ఆయన సూచించిన అనేక విషయాలను మననం చేసుకుని,వాటిని అనుసరించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.దేశంలో వ్యవసాయం గుడ్డెద్దు చేల్లో పడ్డ చందంగా మారింది. విపరీతమైన రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతోంది. మనుషుల్లో రోగాలకు కారణం అవుతోంది. ఎరువులన్నీ మనుషుల్లో నిక్షిప్తం అయి కొత్త రోగాలను కొని తెచ్చుకుంటున్నాం. క్యాన్సర్ లాంటి వ్యాధులను ఆహ్వానిస్తున్నాం. ఈ క్రమంలో వ్యవసాయాన్ని సేంద్రియం వైపు మళ్లించాలి. అలాగే రైతులకు అనువరమైన సేంద్రియ పద్ధతులను అందుబాటులోకి తీసుకుని రావాలి. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు హామీ ఇవ్వాలి. ప్రజలకు ఆహార ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకుని రావాలి. సేంద్రియ ఉత్పత్తులను విదేశాలకు విరివిగా ఎగుమతి చేసుకునేలా చేయాలి. ఇందుకు పాలకులు ప్రతినబూని పనులు చేపట్టాలి. వ్యవసాయాన్ని పండగ చేయాలంటే ఇవి మాత్రమే చేయాలి. అంతేగానీ కబుర్లు చెప్పడం మానాలి. దేశ ఆహార భద్రతకు కీలకమైన, వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ఒకరు. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పిలుస్తున్నాం. కాని ఆయన తరచుగా వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల అభివృద్ధికి సూచించిన సలహాలను విస్మరిస్తూ వచ్చాం. జాతీయ రైతు కమిషన్ ఛైర్మన్‌గా స్వామినాథన్ ప్రభుత్వాల ముందుంచిన నివేదికలు చాలా విలువైనవి. వాటిని అమలు చేస్తామని అంటున్న పాలకులు వాటి జోలికి పోవడం లేదు. ఊకదంపుడు ఉపన్యాసాలు, రుణమాఫీలు,రైతుబంధు వంటి పథకాలతో మభ్యపెడు తున్నారు. ఆయన 2005-2006 సంవత్సరాల్లో ప్రభుత్వం ముందుంచిన సమగ్ర జాతీయ రైతు కమిషన్ నివేదికలు పాలకుల పక్షపాత వైఖరిని బహిర్గతం చేశాయి. అనేకమంది రైతులు తమ ఆందోళనల్లో తరచూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని కోరుతున్నారు. విచ్చలవిడి రసాయనాల వాడకం, యంత్రాల వినియోగం వలన జరుగుతున్న నష్టాల్ని 1968 సైన్స్ కాంగ్రెస్ స్థాయిలోనే వివరించారు. స్వామినాథన్ రాజ్యసభ సభ్యుడిగా మహిళా రైతుల హక్కుల గురించి, పటిష్ట వ్యవసాయ రంగ అభివృద్ధి గురించి, సమగ్ర భూ, రైతు రక్షణ అంశాలతో కూడిన సంస్కరణల విషయాల్ని ప్రస్తావించారు. మహిళా రైతులకు భూ వనరు, ప్రభుత్వ పథకాల విస్తరణకు తగిన చట్టాల్ని ప్రవేశ పెట్టిన ఘనత స్వామినాథన్‌ది. వ్యవసాయ సాంకేతికాల విస్తరణ, ఉత్పత్తి పరంగా ప్రభుత్వ పాత్ర పెరగాలని, ప్రభుత్వేతర సంస్థల ద్వారా రైతులకివ్వబడే సాంకేతికాల పరంగా, నియంత్రణ జరగాలని చట్ట సభలో వ్యక్తపరిచారు. ముఖ్యంగా కృత్రిమ జన్యు మార్పిడి ద్వారా జరిగిన సాంకేతికాల్ని విశ్లేషించి, పరిశోధించుకుండా విస్తరింప చేయ కూడదని చెప్పారు. స్వామినాథన్ తన 98 ఏళ్ల జీవితంలో అనేక వైవిధ్యమైన విజయాలను అందుకున్నారు. అదే సమయంలో అసంబద్ధ విమర్శలనూ ఎదుర్కొన్నారు. స్వామినాథన్ దేశ ముఖ్య ఆహార పంటలైన గోధుమ, వరి వంటి వ్యవసాయాల్ని మలుపు తిప్పారు. స్వామినాథన్ తన కుటుంబ నేపథ్యమైన వైద్య వృత్తిని చేపట్టకుండా కీలకమైన వ్యవసాయ రంగాన్ని ఎన్నుకోవటమే దేశీయ వ్యవసాయంపై ఆయనకున్న ఆసక్తిని గుర్తించాలి. వ్యవసాయ-జన్యు శాస్త్రవేత్తగా నైపుణ్యత పొందటమే గాకుండా దేశీయ వ్యవసాయానికి విలువైన సూచనలు చేశారు. ప్రఖ్యాత విదేశీ సంస్థల్లో, గుర్తింపు పొందిన శాస్త్రవేత్తల నేతృత్వంలో ఐరోపాలో పని చేసి, అక్కడే ఉండకుండా భారతదేశం రావటమే స్వామినాథన్ దేశభక్తికి నిదర్శనం. ఆయన దేశ ఉన్నత వ్యవసాయ పరిశోధనా మండలి నిర్దేశకుడిగా ఎదగటం విలువైన విషయం. కేంద్ర ప్రభుత్వ ముఖ్య వ్యవసాయ సలహాదారుగా ప్రముఖ పాత్ర వహించారు. దేశ ఆహార భద్రతకు కీలకమైన గోధుమ పంట సాగును మలుపు తిప్పేందుకు కృషి చేసి ఎందరో శాస్త్రవేత్తల్ని, విద్యావేత్తల్ని తయారుచేశారు. సమాంతరంగా ఆసియా దేశాల మూల వరి వంగడాల ప్రభావాలతో మార్చబడిన వారి వ్యవసాయాన్ని మలుపు తిప్పారు. ఫలితంగా 1980-85 నాటికి దేశంలో తిండిగింజల ఉత్పత్తి ఐదు రెట్లు పెరిగింది. సమాంతరంగా వివిధ ఆహార పంటలు, వ్యవసాయ ఉప వృత్తుల ఉన్నతికి తగిన మానవ వనరును రూపొందించగలిగిన సంస్థలెన్నో ఏర్పడ్డాయి. అనేక ఆసియా, ఆఫ్రికా దేశాల వ్యవసాయ పరిశోధనారంగ ప్రగతికి తోడ్పడ్డారు. చైనా, వియత్నాం, ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్ వంటి దేశాల పరిశోధనా రంగ ప్రగతికి తోడ్పాటునిచ్చారు. చైనా నెలకొల్పిన వ్యవసాయ వ్యవస్థ ప్రత్యేకతను గుర్తించారు. స్వామినాథన్‌ను అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అలానే, అనేక సంస్థలు, వ్యక్తులు పురస్కాలిచ్చారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి ద్వారా ఆయన మొదటి 'ప్రపంచ ఆహార పురస్కారం' పొందటం విశేషం. మరణానంతరం భారత రత్న కూడా ఇచ్చారు. భారతదేశం హరిత విప్లవ వరవడిలో నష్టపోయిన, స్థానిక చిరుధాన్య పంటల అభివృద్ధికి తన సంస్థ ద్వారా కృషి సల్పారు. అలానే వ్యవసాయ అనుబంధ వృత్తిగా ఉన్న మత్స్యకారులు అభివృద్ధికి తగిన పథకాలను రూపొందించి దక్షిణ భారతదేశ తీర ప్రాంతంలో పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు నిర్వహించారు. మడ అడవుల్ని రక్షించి జలజీవాల మనుగడను కాపాడే పథకాలను అమలు చేశారు. ఆహార భద్రత పథకాల అమలు విషయంలో ప్రభుత్వాల ఆచరణ అంశాలను విశ్లేషించగల శాఖల్ని నిర్వహించారు. జీవిత చివరి దశలో జాతీయ రైతు కమిషన్ బాధ్యుడిగా, భారతదేశ రైతులకు తగిన సంస్కరణలను ముఖ్యంగా ఆదివాసీలకు, చిన్న సన్నకారు వృత్తిదారుల అభివృద్ధికి తగిన విధంగా సూచనలివ్వటం గర్వించదగిన విషయమని చెప్పుకొన్నారు. అఖిల భారత కిసాన్ సభ నాయకులతో కలిసి, తను ఆశించిన ప్రభుత్వాల వైఖరిలో రావాల్సిన మార్పుల్ని వ్యక్తపరిచారు. పరోక్షంగా భూసారం, పర్యావరణం కాపాడబడాలంటే, దున్నే వారికే భూమి, సాగునీటి వనరు ఉండాలని వివరించారు. పంట భూములు వ్యవసాయేతర రంగాలకు, సంస్థలకు మరల్చకూడదని సూచించారు. వ్యవసాయ రక్షణకు ప్రత్యేక వ్యవసాయ మండళ్లను రూపొందించాలని సూచించారు. ఇవన్నీ ఎంతో విలువైన సమాచార భాండాగారంగా గుర్తించి అమలు చేయాలి. దేశీయ వ్యవసాయాన్ని పరుగులు పెట్టించి, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, ప్రజలకు ఆహారధాన్యాలను అందిం చడమే స్వామినాథన్‌కు మనమిచ్చే నిజమైనా నివాళి అని గుర్తించాలి.

# ఘోష్ కమిషన్.. కాంగ్రెస్ దారెటు.. బీజేపీ కోర్టులోకి బంతి?



హైదరాబాద్,తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘట్టంపై రాజకీయ దుమారం కొనసాగుతూనే ఉంది. బ్యారేజీ దెబ్బతిన్న విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు 16 నెలలు విచారణ చేసి ఒక నివేదిక సమర్పించారు. ఇందులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావులతో పాటు పలువురు అధికారుల పాత్రను తప్పుపట్టింది.అలాగే ప్రస్తుతం బీజేపీ ఎంపీ, ఆనాటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కూడా ఆక్షేపించింది. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తదితర మంత్రుల సమక్షంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదికలోని ముఖ్యమైన అంశాల సారాంశాన్ని ఒక ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేసీఆర్ తన పార్టీ నేతల సమావేశంలో ఒక వ్యాఖ్య చేస్తూ అది కాంగ్రెస్ కమిషన్ అని ఆరోపించారు. ఈ నివేదిక పేరుతో కొన్ని అరెస్టులు కూడా జరగవచ్చని ఆయన అంచనా వేశారు. తదుపరి హరీష్ రావు బీఆర్ఎస్ పక్షాన మరో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో కమిషన్ చేసిన అబ్జర్వేషన్స్‌ను తప్పుపట్టారు. హరీష్ అలా చేయడం న్యాయ వ్యవస్థను కించపరచడమేనని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. ఈ వాద ప్రతివాదాలలో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అన్నదానిపై ఇప్పటికిప్పుడే ఒక అభిప్రాయానికి రాలేము.ఈ సందర్భంలో గతంలో ఆయా ప్రభుత్వాలపై వేసిన కమిషన్‌లతో ఎవరికి ఇబ్బంది కలగలేదనే చెప్పాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారెవ్వరూ ఈ తరహా కేసులు ఎదుర్కోలేదు. చలన చిత్రాభివృద్ధి సంస్థ అవకతవకలకు సంబంధించి జరిగిన కమిషన్ విచారణకు ఆనాటి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి హాజరయ్యారు. కమిషన్ నివేదికలో ఆయనను తప్పు పట్టలేదు. ఒక భూ సేకరణ స్కాంలో విచారణ జరుగుతున్న సమయంలోనే ఇంకో మాజీ సీఎం స్టే పొందారు. విభజన తర్వాత ఏపీలో రాజమండ్రి పుష్కరాల తొక్కిసలాటలో 29 మంది మరణించిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబే విచారణ సంఘాన్ని నియమించుకున్నారు. అందులో ఆయనను కమిషన్ ఆక్షేపించలేదు. ఇప్పుడు కేసీఆర్ ఈ విచారణ సంఘం నివేదికను ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరం. రేవంత్ ప్రభుత్వం ఆయనపై కేసు పెడుతుందా? అరెస్టు చేస్తారా?.ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్కాంలపై దర్యాప్తు జరిపించి అంతకుముందు సీఎంగా పనిచేసిన చంద్రబాబు నాయుడుపై కేసులు పెట్టింది. కొన్ని కేసుల్లో ఆయన బెయిల్ తెచ్చుకోగా, ఒక కేసులో అరెస్టు అయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళుతుందో అప్పుడే చెప్పలేం. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక కేసులో రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లవలసి వచ్చింది. ఆ అనుభవం రీత్యా కేసీఆర్‌ను కూడా అరెస్టు చేస్తారా అన్న చర్చ ఉన్నప్పటికీ తాము కక్ష రాజకీయాలు చేయబోమని అంటున్నారు. పైగా కేసీఆర్‌కు ఫాం హౌసే ఒక జైలు అని, వేరే జైలు ఎందుకు అని వ్యాఖ్యానించి అరెస్టు జరగక పోవచ్చున్న సంకేతం ఇచ్చారు. ఇది ఒక్క కేసీఆర్‌కే వర్తిస్తుందా? హరీష్ రావు, ఇతర అధికారులకు కూడా వర్తిస్తుందా అన్నది చెప్పలేం. మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లు ఇచ్చి కుంగిన ఘటన కేసీఆర్, హరీష్‌రావులకు, బీఆర్ఎస్‌కు అప్రతిష్ట తెచ్చిందన్నది వాస్తవం.అదే సమయంలో కేసీఆర్ లక్ష్య శుద్ధితోనే కాళేశ్వరం ప్రాజెక్టును సంకల్పించారని చెప్పాలి. కాకపోతే నిర్మాణం వేగంగా చేయాలన్న తొందరపాటులో ఆయన తీసుకున్న నిర్ణయాలు సమస్యలకు దారి తీసి ఉండవచ్చునని అనిపిస్తుంది. కమిషన్ పరిశీలనల్లో ముఖ్యమైనవి కొన్ని ఉన్నాయి. కాళేశ్వరం నిర్మాణంపై ప్రభుత్వ స్థాయిలో కాకుండా, కేసీఆర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారన్నది ఒకటి. మంత్రివర్గం నుంచి పాలనాపరమైన అనుమతులు తీసుకోలేదన్నది ఇంకో పరిశీలన. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పి, బరాజ్‌ను మేడిగడ్డకు మార్చడంలో నిజాయితీ కొరవడిందన్నది మరో వ్యాఖ్య. మేడిగడ్డ వద్ద నిర్మాణానికి రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ వ్యతిరేకత తెలిపినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కొందరు కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చే యత్నం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ తప్పుడు డిజైన్లు ఇచ్చిందన్నది వేరొక ఆరోపణ. అధిక వడ్డీకి రూ. 84 వేల కోట్ల అప్పు చేయడాన్ని కూడా తప్పు పట్టారు. ఈ విషయాలను ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. శాసనసభలో చర్చించిన తర్వాతే తదుపరి చర్యలు చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు.ఘోష్ కమిషన్ నివేదికను ఆధారం చేసుకుని బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ దాడి పెంచింది. అయితే, వెంటనే ఏం చేయాలన్న దానిపై ఒక నిర్ణయానికి రాలేకపోయింది. అసెంబ్లీలో ఎటూ ఈ నివేదికను పెడతారు. అందులో ఆయా పార్టీల ఎమ్మెల్యేలు తమ వైఖరికి అనుగుణంగానే మాట్లాడుతారు తప్ప కొత్తగా చెప్పేది ఉంటుందా అన్నది సందేహం. అయినా అసెంబ్లీలో చర్చించడం మంచిదే. ఈ నివేదికలో కొంతమంది కీలక అధికారుల పాత్ర గురించి విస్మరించారన్న వాదన ఉంది. ప్రస్తుత సీఎస్‌గా ఉన్న రామకృష్ణారావు జోలికి కమిషన్ వెళ్లలేదని చెబుతున్నారు. బారేజ్‌ను మేడిగడ్డకు మార్చడం వల్ల ఆరు వేల కోట్ల నష్టం జరిగిందని కమిషన్ అభిప్రాయపడిందని కథనం. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టుకు అయిన దాదాపు లక్ష కోట్ల వ్యయం వృథా అయినట్లే అన్నట్లు ముఖ్యమంత్రి మొదలు, మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తుండడం విశేషం. ఈ ప్రాజెక్టులో మరో రెండు బారేజీలు, కాల్వలు, టన్నెల్స్ తవ్వకం, రిజర్వాయర్ల నిర్మాణం వంటివి కూడా ఉన్న విషయాన్ని ప్రజలలోకి వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారని అనిపిస్తుంది.స్థల ఎంపికపై నిపుణుల కమిటీ అభిప్రాయాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదో కేసీఆర్ వివరించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకువెళ్లనిచ్చిందన్న ప్రశ్న వస్తుంది. పైగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ ప్రాజెక్టుకు ప్రశంసించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పఢ్నవీస్ స్వయంగా ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి హాజరై కేసీఆర్‌ను మెచ్చుకున్నారు. మరో పాయింట్ ఏమిటంటే ప్రస్తుతం కాంగ్రెస్ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వంలో కూడా మంత్రిగా, కాళేశ్వరం సబ్ కమిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయన ఆ రోజుల్లో ఈ ప్రాజెక్టును సమర్థించినట్లే కదా!. దానిపై ఏం చెబుతారు?. ప్రాణహిత-చేవెళ్లకు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన ఈ ప్రాజెక్టును రికార్డు సమయంలో నిర్మాణం చేసి ఘనత తెచ్చుకోవాలన్న క్రమంలో కేసీఆర్ ప్రభుత్వం కొన్ని తప్పులు కూడా చేసినట్లు అర్థం అవుతుంది.అయితే, అవి పెద్ద తప్పులా? కాదా? అన్నది పరిశీలించాలి. ఈ నేపథ్యంలోనే రేవంత్ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది.. అది కూడా మంచిదే. మామూలుగా అయితే ఈ నివేదిక ఆధారంగా కేసులు పెట్టి ఉండవచ్చు. కానీ, అలా చేయకుండా అసెంబ్లీలో చర్చిస్తామని చెబుతున్నారు. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఈ ప్రాజెక్టుపై విచారణకు సీబీఐకి అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం అలా చేస్తుందా? అన్నది ఒక ప్రశ్న. తద్వారా ఈ బాల్‌ను బీజేపీ కోర్టులో వేస్తుందా? అలా జరిగితే కాంగ్రెస్ చేతిలో ఒక ఆయుధం పోయినట్లు అవుతుంది. కనుక ఆ పని చేయకపోవచ్చు. ఇక్కడ మరో సంగతి చెప్పాలి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయి ఇంతకాలమైనా ప్రభుత్వం మరమ్మతులకు సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనివల్ల ప్రాజెక్టు నిరర్థకంగా మారే ప్రమాదం ఉంటుంది. ఉన్న ప్రాజెక్టును వినియోగించుకుంటూనే ప్రభుత్వం తదుపరి చర్యలకు వెళ్లితే మంచిదే.ఇక మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వాదన కూడా సమర్థంగానే ఉందని చెప్పాలి. ఇది ఏకపక్ష నిర్ణయం కాదని, అసెంబ్లీలో కూడా చర్చ జరిగిందని ఆయన అంటున్నారు. కేబినెట్ ఆమోదం కూడా ఉందన్నది ఆయన వాదన. మొత్తం 665 పేజీల రిపోర్ట్ కాకుండా సంక్షిప్త నివేదికను బహిర్గతం చేస్తే సరిపోతుందా? అని ఆయన ప్రశ్నిస్తున్నారు. తుమ్మిడి హెట్టి వద్ద నీటి లభ్యత సరిపడా లేదని కేంద్ర జల సంఘమే చెప్పిందని హరీష్ రావు వివరిస్తున్నారు. మరి కమిషన్ తన నివేదికలో అందుకు విరుద్ధంగా ఎలా పెట్టిందో తెలియదు. అలాగే మంత్రివర్గ ఆమోదం ఉందన్న హరీష్ వాదనకు కేబినెట్ తీర్మానాలు చూపించాల్సి ఉంటుంది. అసెంబ్లీలో చర్చ జరిగిన మాట అయితే వాస్తవం. దానిని కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదా అన్నది చూడాలి. ఎన్నికల ముందు చోటు చేసుకున్న ఈ ఉదంతం బీఆర్ఎస్‌కు నష్టం చేసింది.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలడం, పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిన ప్రమాదం వంటి వాటిని ఈ సందర్భంగా హరీష్, కేటీఆర్ తదితరులు ప్రస్తావిస్తున్నారు. గుజరాత్‌లో ఒక వంతెన కూలిన ఘటనలో పెద్ద సంఖ్యలో ప్రజలు మరణించిన ఉదంతాన్ని కూడా ఉటంకిస్తున్నారు. ప్రమాదాలు జరిగితే దానిని ముఖ్యమంత్రికి అంటగడితే, ఇప్పుడు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటనకు రేవంత్, ఉత్తమ్ కుమార్ బాధ్యత వహిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైతే మరీ తీవ్రమైన చర్య తీసుకుంటుందా అన్నది సందేహమే. రాజకీయంగా తమకు ప్రయోజనం అనుకుంటేనే అలా చేసే అవకాశం ఉంటుంది. కాకపోతే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. బీఆర్ఎస్ మాత్రం డిఫెన్స్ నుంచి అఫెన్స్ వెళ్లడానికి ప్రయత్నిస్తుంది.అందుకే కేసీఆర్ దీనిని కాంగ్రెస్ కమిషన్ నివేదిక అని ధ్వజమెత్తితే, కేటీఆర్ ఈ నివేదిక ఒక ట్రాష్ అని వ్యాఖ్యానించారు. హరీష్ రావు ఇది రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నారు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు ఎలా ఉన్నా.. ఏ మాత్రం అవకాశం ఉన్నా వెంటనే ఆ బారేజీకి రిపేర్లు చేయించి, నీటిని ప్రజలకు అందుబాటులోకి తేవడం ఉపయుక్తం అని చెప్పాలి.

# అమెరికాలో బియ్యం ఇక బంగారమే..



న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకం విధించిన తర్వాత అమెరికాలో స్థిరపడిన భారతీయులకు బియ్యం ధరలు చుక్కలు చూపించనున్నాయి. భారత దేశం నుంచి దిగుమతి అయ్యే బియ్యానికి 50 శాతం అధికంగా చెల్లించాల్సి వస్తుంది. అమెరికాలో నివసించే భారతీయులలో అత్యధికులు బియ్యం లేదా గోధుమలను తమ ఆహారంగా తీసుకుంటారు. భారత్ నుంచి దిగుమతి అయ్యే బియ్యాన్ని కొనే శక్తి లేని వారు ఇక పాకిస్థాన్ నుంచి దిగుమతి అయ్యే బియ్యంతో సరిపెట్టుకోవలసి వస్తుంది. పెరిగిన ధరలు ఆగస్టు 27 నుంచి అమలులోకి రానున్నాయి. భారత్ నుంచి ప్రతి ఏటా అమెరికాకు 2.5 లక్షల టన్నుల బియ్యం ఎగుమతి అవుతుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పండే సోనా మసూరీ రకం దాదాపు 40 శాతం ఉంటుంది. మిగిలిన 60 శాతం పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఇతర ఉత్తరాది రాష్ట్రాలలో పండించే బాస్మతి రకం ఉంటుంది. అమెరికాలో నివసిస్తున్న భారతీయులలో అత్యధికులు సోనా మసూరీ పైనే నిత్యం ఆధారపడుతుంటారు. బాస్మతి బియ్యాన్ని బిర్యానీ వంటి వంటకాలకు మాత్రమే ఉపయోగిస్తుంటారు. అమెరికాలో ప్రస్తుతం ఒక టన్ను సోనా మసూరీ బియ్యం ధర 900 డాలర్ల(రూ. 78,714) నుంచి 1000 డాలర్ల(రూ. 87,460) వరకు ఉంటోంది. టన్ను బాస్మతి బియ్యం 1,200 డాలర్ల (రూ. 1.05 లక్షలు) నుంచి 1,300 డాలర్ల(రూ. 1.14 లక్షలు) మధ్య ఉంటుంది. ట్రంప్ ప్రకటన అమలులోకి వచ్చిన తర్వాత వీటి ధరలు 50 శాతానికి పైగా పెరిగిపోయే అవకాశం ఉంది. పాకిస్థాన్ నుంచి దిగుమతి అయ్యే బియ్యంతో పోలిస్తే భారత్ నుంచి దిగుమతి అయ్యే బియ్యం అమెరికాలో చాలా ఖరీదు కానున్నది. రష్యా చమురును కొనుగోలు చేస్తున్న భారత్‌ను లొంగదీసుకునేందుకు అమెరికాలో నివసించే భారతీయులపై ఒత్తిడి తీసుకురావడమే ట్రంప్ వ్యూహమని నిపుణులు భావిస్తున్నారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని బియ్యం ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు బీవీ కృష్ణారావు హెచ్చరించారు. అయితే దీని పూర్తి ప్రభావం ఏమిటో రానున్న వారాలలో తెలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### పంజాబ్‌పై ప్రభావం

దేశంలో బాస్మతి రకం బియ్యాన్ని అత్యధికంగా పండించే పంజాబ్ ట్రంప్ నిర్ణయం కారణంగా తీవ్రంగా నష్టపోనున్నది. ప్రస్తుతం ట్రంప్ విధించిన పన్నుల వల్ల ఒక టన్ను భారతీయ బాస్మతి బియ్యం ధర 1,200 డాలర్ల(రూ. 1.05 లక్షలు) నుంచి 1,800 డాలర్లకు(రూ. 1.57 లక్షలు) పెరిగే అవకాశం ఉంది.

# ముదరిన శాతవాహన కాలేజీ వ్యవహారం

విజయవాడ, విజయవాడలో శాతవాహన కళాశాల వివాదం వ్యవహారం మరో మలుపు తిరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్ తనకు టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో ప్రాణహాణి ఉందని తనను ఆలపాటి బెదిరిస్తున్నారని రక్షణ కల్పించాలని విజయవాడ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. తాజా పరిణామాలపై స్పందించిన టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్.. కీలక వ్యాఖ్యలు చేశారు.. శాతవాహన కాలేజీ ప్రారంభించి 53 యేళ్లు అయ్యింది.. అనేకమంది పెద్దలు సెక్రటరీ లుగా పని చేశారు.. 2011లో నేను సెక్రటరీగా అయిన సమయంలో ఈ ఆస్తిని లోక్ అదాలత్‌లో పెట్టినట్లు- వంకాయలపాటి కామేశ్వరరావు, బోయపాటి అప్పారావు మధ్య వివాదం నడిచింది.. ఆ తరువాత ఈ వివాదం సుప్రీంకోర్టు వరకూ కూడా వెళ్లింది.. ఆ తర్వాత శ్రీనివాసరావు, ప్రజాప్రతిరావులు కోర్టులో గెలిచి కూడా పిటిషన్ వెనక్కి తీసుకోవడం ఆశ్చర్యం కలిగించింది.. ఆ తరువాత కళాశాలను అర్ధరాత్రి పడగొట్టారని.. రిట్ పిటిషన్ లు విత్ డ్రా చేశారని ప్రజాప్రతిరావు కోర్టు ను ఆశ్రయించారు.. వంకాయలపాటి శ్రీనివాసరావు టెంపరరీ ప్రిన్సిపాల్ గా ఉంటూ రికార్డులు బయటకు ఇచ్చారు.. దీనిపై చర్చకు రావాలని నేను కోరినా ఆయన రాలేదు.. ఫోన్ లో ఎందుకు రాలేదని ప్రశ్నిస్తే.. నేను బెదిరించానని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు ఆలపాటి. శాతవాహన కళాశాల నడపాలన్నదే మా ఉద్దేశం అని స్పష్టం చేశారు ఆలపాటి రాజేంద్రప్రసాద్.. ఈ నెల 12న సుప్రీంకోర్టులో కేసు విచారణ ఉన్నందునే ఇప్పుడు వంకాయలపాటి శ్రీనివాసరావు కొత్త డ్రామా ఆడుతున్నారు.. అసలు తాత్కాలిక ప్రిన్సిపాల్ గా ఉన్న శ్రీనివాసరావుకు ఈ వివాదంతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు.. పద్ధతి మార్చుకో... తప్పు చేయకు అని చెబితే... బెదిరింపులు అంటారా? అని మండిపడ్డారు. ఈ వివాదం లో పోలీసులు కు చిత్తశుద్ధి ఉంటే శ్రీనివాసరావు ను అరెస్టు చేయాలని టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో ప్రాణహాణి ఉందని.. రక్షణ కల్పించాలని విజయవాడ పోలీస్ కమిషనర్ కు ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. 2 నెలల క్రితం తనను ఆలపాటి అనుచరులు కళాశాల విషయంలో కిడ్నాప్ చేశారని.. ఆ సమయంలో పోలీసులకు తన కుమారుడు ఫిర్యాదు చేస్తే అర్థరాత్రి సమయంలో విడుదల చేశారని తెలిపారు. ఇప్పుడు తాజాగా మరోసారి ఆలపాటి తనను ఫోనులో బెదిరిస్తున్నారని వంకాయలపాటి సీపీకి ఫిర్యాదు చేసిన తర్వాత మీడియాకు తెలిపారు. శాతవాహన కళాశాల విషయంలో తన మాట వినాలని లేకపోతే తనను చంపేస్తానని ఆలపాటి బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై డీజీపీకి కూడా ఫోన్ కాల్ ఆడియోను కూడా జత చేసి ఫిర్యాదు చేసినట్టు- వంకాయలపాటి తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కూడా స్పందించారు. శాతవాహన కళాశాలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను వంకాయలపాటిని ప్రిన్సిపల్ గా తొలగించాలని కరస్పాండెంట్ కు చెబితే ఆయన వద్దని వారించి శ్రీనివాస్ ను తన దగ్గరకు తీసుకువస్తానని చెప్పారని శ్రీనివాస్ రాకపోతే తాను ఫోన్ చేసిన మాట వాస్తవమన్నారు. అయితే తాను చంపేస్తానని బెదిరించలేదని కేవలం చట్టపరంగా చర్యలు తీసుకుంటానని తెలిపానన్నారు.

# ఒక్కరే సేఫ్!

అమరావతి,ఏపీ లిక్కర్ స్కాం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. వైసీపీ ముఖ్య నేతలు ఈ కుంభకోణంలో ఇరుక్కుని ఇప్పటికే జైలుకు వెళ్లారు. అయితే స్కాంలో కీలక నిందితుడుగా చెబుతున్న ఏ34 వెంకటేశ్ నాయుడు పాత్ర ఇటీవల సంచలనంగా మారింది. ఆయన ఫోన్ నుంచి సిట్ వెలికి తీసిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలక నేతలు అందరితోనూ ఆయన ఫొటోలు బయటకు రావడంతో లిక్కర్ స్కాంలో పాత్రధారులు అంటూ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ తో వెంకటేశ్ నాయుడు ఫొటోలు దిగడంతో వైసీపీ అటాక్ ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోద్బలంతోనే స్కాం జరిగిందని ఆరోపిస్తోంది.అయితే వైసీపీ ఆరోపణల్లో పస లేకపోయినప్పటికీ వెంకటేశ్ నాయుడు ఫొటోలు మాత్రం తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీల నేతలు అందరినీ ఉలికిపాటుకు గురిచేశాయి. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం మంత్రివర్గ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. వెంకటేశ్ నాయుడు వంటివారితో ఫొటోలు దిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన మంత్రివర్గ సహచరులకు సూచించారు. వెంకటేశ్ నాయుడు ఎవరో ఎలాంటి వాడో ముందుగా చంద్రబాబుకు తెలియక పోయినప్పటికీ, నిందితుడు తనతో దిగిన ఫోటోను చూసి చంద్రబాబు షాక్ తిన్నారని అంటున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి లోకేశ్ తోపాటు ఇతర టీడీపీ నేతలతోనూ వెంకటేశ్ నాయుడు ఫొటోలు దిగారు. అదే సమయంలో తెలంగాణలో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకులతోనూ సన్నిహిత సంబంధాలు నెరిపినట్లు బయటపడింది.డబ్బు కట్టలు లెక్కపెడుతున్న వెంకటేశ్ నాయుడు వీడియో వైరల్ అయిన తర్వాత చాలా ఫొటోలు బయటకు వచ్చాయి. రెండు రాష్ట్రాల్లో ముఖ్యులు అందరితోనూ ఆయన ఫొటోలు ఉండటంతో ఆయన ఎవరికి సన్నిహితుడు? ఏం చేస్తుంటాడు అన్న చర్చ మొదలైంది. అయితే ఇదే సమయంలో ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రమే వెంకటేశ్ నాయుడు నుంచి సేఫ్ గా తప్పించుకున్నారని అంటున్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రముఖులు అందరితోనూ వెంకటేశ్ నాయుడు ఫొటోలు బయటపడ్డాయి. ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఎప్పుడో ఒకసారి వారు కలవడం జరిగింది. సందర్భం ఏదైనా నాటి ఫొటోలు ఇప్పుడు రచ్చకు దారి తీస్తున్నాయని అంటున్నారు.కానీ, డిప్యూటీ సీఎం పవన్ మాత్రం ఈ ఎపిసోడ్ లో సేఫ్ గా ఉండటమే ఆసక్తికరంగా మారింది. దాదాపు పదేళ్లుగా రాజకీయాల్లో కీలకంగా ఉన్న పవన్ వద్దకు ఒకసారి కూడా వెంకటేశ్ నాయుడు వెళ్లలేదా? లేక పవన్ మాత్రమే ఆయన ఎవరో తెలుసుకుని అపాయింట్‌మెంట్ ఇవ్వలేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

## రాహుల్ పరిపక్వత లేని నేత

ఒంగోలు, కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పూర్తి నిరాధారమని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విమర్శించారు. రాహుల్ ఆరోపణలు పరిపక్వత లేని విధంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఒంగోలులో మీడియాతో మాధవ్ మాట్లాడారు.రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కర్ణాటక ఎన్నికల సంఘం స్పందించి ఆధారాలు సమర్పించాలని కోరింది. లేదంటే ఆ వ్యాఖ్యలను ఉపసంహకరించుకోవాలని కోరినా ఆయన స్పందించలేదు. ఇదే ఆయనలో పరిపక్వత లేదని చెప్పేందుకు ఉదాహరణ. రాహుల్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా కల్పిస్తే న్యాయం చేయలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలపై దృష్టి సారిస్తాం. పొగాకు నుంచి ఆక్వా వరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పీవీఎన్ మాధవ్ అన్నారు.

## భారత్ వ్యూహాత్మక అడుగులు...

మాస్కో,గత కొన్ని రోజులుగా భారత్, రష్యా, అమెరికా మధ్య ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రష్యాతో భారత్ తన స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. ఇదే సమయంలో అమెరికా నుంచి వస్తున్న ఒత్తిడిని కూడా ఎదుర్కొంటోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, మన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో మాస్కోలో గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భారత్-రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడింది. ఒక రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ నుంచి వచ్చే ఉత్పత్తులపై 25 శాతం అదనపు సుంకం విధిస్తూ ఆదేశాలు జారీ చేసిన తర్వాత ఈ మీటింగ్ జరిగింది. దీంతో భారత్ ఉత్పత్తులపై మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. ఎందుకంటే, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం. ఈ సుంకాల విషయంలో అమెరికా ఒక షరతు కూడా పెట్టింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇప్పుడు నాలుగో ఏడాదిలోకి అడుగుపెడుతోంది. ఈ యుద్ధాన్ని శుక్రవారం నాటికి రష్యా ఆపకపోతే రష్యా చమురు కొనే దేశాలపై ఆంక్షలు డబుల్ చేస్తామని అమెరికా హెచ్చరించింది. ఈ కొత్త సుంకాలు రెండు దశల్లో అమల్లోకి వస్తాయి. మొదటి 25 శాతం ఆగస్టు 7 నుంచి, మరో 25 శాతం 21 రోజుల తర్వాత. అయితే, చర్చల ద్వారా ఏదైనా మార్పు వస్తే మాత్రం ఈ పరిస్థితి మారే అవకాశం ఉంది. అమెరికా ఈ నిర్ణయంతో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్, ఈ సుంకాలను అన్యాయం, ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. భారత ఆర్థిక స్వాతంత్రాన్ని కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే, అమెరికా కూడా రష్యా నుంచి యురేనియం, పల్లాడియం, ఎరువులు దిగుమతి చేసుకుంటు-ందని, దీన్ని డబుల్ స్టాండర్డ్స్ అనకూడదా? అని విమర్శించారు. మరోవైపు అజిత్ దోవల్, రష్యా సెక్యూరిటీ- కౌన్సిల్ సెక్రటరీ సెర్గీ షోయిగుతో సమావేశంలో పుతిన్ ఈ ఏడాది భారత్‌కు రానున్నారని, తేదీ త్వరలో ఖరారు అవుతుందన్నారు. ఈ సందర్శన గురించి భారత్ చాలా ఉత్సాహంగా ఉందని, గతంలో జరిగిన భారత్-రష్యా సమావేశాలు రెండు దేశాల సంబంధాల్లో కీలకమైనవని దోవల్ అన్నారు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

## ఆవరిస్తున్న క్యుములో నింబస్

హైదరాబాద్,రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్టు-వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనంతో మరో నాలుగు రోజులు వానలు దంచికొట్టనున్నాయని పేర్కొంది. నల్లగొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక క్యుములో నింబస్ మేఘాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం కూడా నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నిన్నటి అంత వర్షం కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం వరకు ఎలాంటి వర్ష సూచన లేదన్నారు. సాయంత్రం వేళ పలుచోట్ల ఉరుములు, మెరుపులు సంభవించనున్నాయి. మరో ఐదు రోజులపాటు- తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. 9, 10 తేదీల్లో నల్గొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 11, 12వ తేదీల్లో తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కరిసే అవకాశం ఉందని తెలిపింది. 13వ తేదీన తెలంగాణలోని అన్ని జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## తెలంగాణ సమాజం వెయిటింగ్?

హైదరాబాద్,బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. ఫామ్ హౌస్ నుంచి ఎప్పుడు బయటకు వస్తారు? ప్రజలను ఉద్దేశించి ఎప్పుడు మాట్లాడతారు? ఇదీ.. తెలంగాణలోని పట్టణాల నుంచి గ్రామాల వరకు కూడా వినిపిస్తున్న మాట. ఈ వ్యవహారంపైనే పెద్ద ఎత్తున చర్చ కూడా సాగుతోంది. దీనికి ప్రధానంగా నాలుగు కారణాలు కనిపిస్తున్నాయి. ఈ నాలుగు కూడా బీఆర్‌ఎస్ పార్టీ చుట్టూ గత రెండు మూడు వారాలుగా తీవ్రస్థాయిలో హల్చల్ చేస్తున్న అంశాలే కావడంతో ఇటు ప్రజల్లోనూ.. అటు పార్టీ వర్గాల్లోనూ.. కేసీఆర్ ఎప్పుడు వస్తారు? ఆయా విషయాలపై ఎప్పుడు మాట్లాడతారు? ఏం చెబుతారు? అనే ఉత్కంఠ నెలకొంది.

ఆ నాలుగు ఇవీ..

1) బీఆర్‌ఎస్ విలీనం: గత కొన్నాళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నారని.. దీనికి సంబంధించి గత ఏడాదే ప్రతి పాదన కూడా వచ్చిందనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ విషయాన్ని బయటి వారో.. లేక పార్టీ ప్రత్యర్థులో చెప్పి ఉంటే.. ఆ పరిస్థితి వేరేగా ఉండేది. కానీ.. వారితోపాటు.. కేసీఆర్ గారాలపట్టి కవితే.. రెండు మూడు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. తాను జైల్లో ఉన్నప్పుడు.. స్వయంగా తన సోదరుడు కేటీఆరే.. విలీన ప్రతిపాదన చేశారని.. కానీ.. తాను వద్దన్నానని చెప్పారు. ఇక.. తాజాగా పార్టీ నాయకులు కూడా ఇదే మాట వక్కాణిస్తున్నారు. దీంతో అసలు బీఆర్‌ఎస్ విలీనంపై చర్చ ఎందుకు వచ్చింది? తెరవెనుక ఏం జరిగింది? ఇది నిజమేనా? అనేది.. కేసీఆర్ నోటి నుంచే వినాలని తెలంగాణ సమాజం ఎదురు చూస్తోంది.

2) కవిత వ్యవహారం: తన గారాలపట్టి కవిత.. ఇప్పుడు దూకుడుగా ఉన్నారు. పార్టీలో భాగస్వామ్యం కాదు.. పార్టీనే కావాలని కోరుతున్న కవిత.. అన్నపై అనధికారి.. పరోక్ష యుద్ధమే చేస్తున్నారు. డియర్ డాడీ లేఖ నుంచి ఇప్పటి వరకు ఆమె స్వతంత్రంగా రాజకీయాలు చేస్తున్న విషయం తెలిసిందే. ధర్నాలు చేసినా.. కార్యక్రమాలు చేపట్టినా.. బీఆర్‌ఎస్ కండువా లేదు. జెండా లేదు. అంతా జాగృతి జెండాలే.. సొంత అజెండాలే. ఈ నేపథ్యంలో కవిత వ్యవహారంపై పార్టీ అధిపతిగా కేసీఆర్ వైఖరి ఏంటి? ఓతండ్రిగా ఆయన నిర్ణయం ఎలా ఉందనేది గ్రామ గ్రామానా జరుగుతున్నచర్చ. దీనిపై కూడా ఆయన ఏం చెబుతారన్న విషయంపై ఆసక్తిగా చెవులు రెక్కించి మరీ చూస్తున్నారు. 3) బీసీ రిజర్వేషన్‌పై వైఖరి: తెలంగాణ ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్ వ్యవహారం రాజకీయంగా కాక రేపు తోంది. బీజేపీ-కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధాలు.. పొలిటికల్ ఫైటింగులు కూడా జరుగుతున్నాయి. మరోవైపు.. దీనిని ప్రతిష్టా త్మకంగా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేసి.. మోడీపై నిప్పులు చెరిగారు. కీలకమైన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ బిల్లు వ్యవహారం పై ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ అధినేత ఇప్పటి వరకు స్పందించలేదు. దీనికి మద్దతు ఇస్తారా? లేక.. ఇవ్వరా? ఇస్తే.. ఎలా? ఇవ్వకపోతే రీజనేంటి? అనే అంశాలపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా చూస్తే.. బీసీ సంఘాలుకూడా.. అంతే ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. 4) కాళేశ్వరం రిపోర్టు: ఇక, రాజకీయ దుమారం రేపిన కీలక అంశం.. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదిక. భారీ ఎత్తున అవినీతి జరిగిందని పేర్కొనడమే కాదు.. నేరుగా మాజీ సీఎం కేసీఆరే అంతా చేశారని కూడా కమిషన్ తన రిపోర్టు లో పేర్కొన్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. దీనిపై అసెంబ్లీలోనూ చర్చిస్తామని.. తర్వాత.. ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ చెప్పారు.

# తగ్గేదేలే... మోడీ ఇమేజ్ ఇప్పుడు గ్లోబల్ రేంజ్ కు!

న్యూఢిల్లీ,జాగ్రత్తగా గమనిస్తే.. అరాచకం అంతకంతకూ ఎక్కువైన ప్రతిసారీ.. దానికి చెక్ చెప్పే కొత్త శక్తి ఒకటి ఆవిర్భవిస్తుంది. ఇక్కడే ఒక ప్రశ్న రావొచ్చు. అసలు అరాచకం ఎందుకు ఉండాలి? దానికి చెక్ చెప్పే పరిస్థితి ఎందుకు రావాలి అని. కాలం ఎప్పుడూ ఒకేలా ఫ్లాట్ గా ఉండటం సాధ్యం కాదు కదా? అందులోనూ కాలం చెప్పాల్సిన పాఠాలు చాలానే ఉంటాయి కదా? భవిష్యత్తుకు గతం ఒక పాఠంగా చెప్పటం.. దాని నుంచి బుద్ధి తెచ్చుకొని మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని మానవాళికి కాలం ఎప్పుడూ చెబుతూనే ఉంటుంది. అయితే.. అన్నిసార్లు..అందరూ దాన్ని అర్థం చేసుకునే పరిపక్వత ఉండదన్న విషయం తెలిసిందే. చరిత్ర పాఠాల్ని తిప్పి చూస్తే.. తనకు మించిన శక్తివంతుడు ఉండరన్నట్లుగా తల ఎగరేసిన సామ్రాజ్యవాదులకు కాలం సరైన సమాధానం చెబుతూనే వస్తోంది. కాకుంటే.. బాధాకరమైన అంశం ఏమంటే.. ఈ ప్రాసెస్ లో బలహీనులు మాత్రమే బలి అవుతుంటారు. అదే క్రమంలో బలవంతుడు సైతం దెబ్బ తినటం స్పష్టంగా కనిపిస్తుంది. అత్యంత శక్తివంతుడికి బుద్ధి చెప్పేందుకు లక్షలాది బలహీనులు బలి కావాల్సిన అవసరం ఉందా? అన్నది ప్రశ్న. బలహీనుల పక్షం నుంచి చూసినప్పుడు అన్యాయంగా కనిపించినప్పటికీ.. ఈ తురహా ఘర్షణ నుంచే కదా కొత్త ప్రపంచం పుట్టుకు వచ్చేదన్న సత్యం మనసుకు అర్థమవుతుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా తీరు ఈ కోవలోకే వస్తుంది. సుంకాల పేరుతో అగ్రరాజ్య అధినేత ప్రదర్శించాల్సిన అహంకారానికి మించి ఆయన వ్యవహరిస్తున్నారు. తన చేతిలో ఆయుధంగా ఉన్న ఆర్థిక ఆంక్షల్ని నిర్మోహమాటంగా ఆయన అమలు చేస్తున్నారు. అయితే.. అత్యంత శక్తివంతమైన వారు ఎలా ఉండాలి? తాను పాలకుడిగా ఉన్న సమూహానికి తనే తీరుతో తాను చేస్తున్న మేలు ఏమిటి? కీడు ఏమిటి? అన్నది చాలా ముఖ్యం. ప్రపంచ జనాభా 820 కోట్లు. అందులో అగ్రాజ్యమైన అమెరికా జనాభా 34.72 కోట్లు మాత్రమే. అంటే ప్రపంచ జనాభాలో అమెరికా వాటా అక్షరాల 4.5 శాతం మాత్రమే. కాకుంటే ప్రపంచ సంపదలో ఆ దేశం అగ్రస్థానంలో ఉండటమే దాని వ్యవహరశైలికి కారణంగా చెప్పాలి. ప్రపంచంలోని మొత్తం సంపదలో అమెరికా వాటా 34 శాతం. అంతేకాదు ప్రపంచంలోని మిలియనీర్లలో 37 శాతం మంది అమెరికాలోనే నివసిస్తున్నారు. సాధారణంగా బలవంతుడు బలహీనుడి మీద తన అధిక్యాన్ని.. అధిపత్యాన్ని ప్రదర్శింస్తుంటాడు. తన ప్రయోజనాలు మాత్రమే ముఖ్యమనే ధోరణి తప్పించి.. బలహీనుల గురించి ఆలోచించే పని చేయడు. అందునా ట్రంప్ లాంటి బిలియనీర్ పాలకుడికి ఆ ఆలోచన కూడా ఉండదు. సహజసిద్ధంగా వ్యాపారి అయిన ట్రంప్.. ఇప్పుడు ప్రపంచానికి పెద్దన్న అమెరికాకు అధినేతగా ఉన్నప్పుడు.. అతగాడి మానసిక ధోరణి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అందునా.. రెండోసారి అగ్రరాజ్యానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు అతగాడు పడిన కష్టం అంతా ఇంతా కాదు. ప్రపంచ చరిత్రలో తన మార్క్ ఒకటి ఉండాలని.. అమెరికా చరిత్రలో తాను ఎప్పటికి ఒక చర్చగా నిలిచిపోవాలన్న ధోరణి ఆయనకు ఎక్కువే. అందునా.. ప్రపంచ శాంతి కోసం పాటు పడిన ప్రముఖుడికి ఇచ్చే నోబెల్ శాంతి పురస్కారాన్ని సొంతం చేసుకోవాలన్న ఆశ ఎక్కువ. దీని కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు అన్ని ఇన్ని కావు. ఇలాంటి వేళలో భారతదేశం నుంచి ఆయనకు అనూహ్యమైన ఇబ్బంది ఎదురైంది. అందులో ప్రధానమైనది భారత్ తో తాను చేయాలనుకున్న వ్యాపారానికి ఒకనాటి తన మిత్రుడైన మోడీ మోకాలు అడ్డటం. అమెరికా



ప్రయోజనాల కోసం ట్రంప్ ఎంతలా అయితే తపిస్తారో.. భారత ప్రయోజనాల కోసం మోడీ అంతే మొండిగా ఉంటారన్న విషయం తెలిసిందే. అందులోనూ.. తన పాలన ముందు వరకు ప్రపంచ దేశాలతో.. ముఖ్యంగా సంపన్న దేశాలతో భారత్ వ్యవహరించే తీరుకు భిన్నంగా వ్యవహరించటం.. తగ్గి ఉండటం.. ఒద్దికగా వ్యవహరించటం.. సంపన్న దేశాల పట్ల భయభక్తుల్ని ప్రదర్శించటం లాంటి వాటిని చాప చుట్టేసి.. భారత్ స్వయంశక్తిగా.. తనకంటూ ఒక ప్రత్యేక లక్షణం ఉన్న దేశమన్న ఇమేజ్ ను తెచ్చి పెట్టే ప్రయత్నంలో ఉన్నారు. ఇలా తమ దేశాల్ని అమితంగా అభిమానించి.. ఆరాధించే ఇద్దరు పాలకుల మధ్య అనూహ్య రీతిలో మొదలైన పోరుకు నిదర్శనంగా వర్తమాన పరిస్థితులుగా చెప్పాలి. పాలకుడు ఎవరైనా తాను పాలించే దేశాన్ని ప్రేమించటం.. దాని ప్రయోజనాల కోసం శ్రమించటం మామూలే. అందుకు నిలువెత్తు నిదర్శనంగా మోడీ నిలిస్తే. ఈ తీరుకు భిన్నంగా తన దేశ ప్రయోజనాల కోసం మిగిలిన దేశాలన్నితాను చెప్పినట్లు.. తన దేశ ప్రయోజనాల కోసం మాత్రమే పని చేయాలని భావించటం.. దాన్ని బలంగా నమ్ముతూ.. నమ్మని వారిపై సుంకాల షాక్ ఇస్తానని చెప్పటంలోనే ఇబ్బంది. ఈ తీరుకు నిలువెత్తు రూపంగా ట్రంప్ నిలుస్తారు. బలవంతుడికి బెదిరించటం అలవాటు. బలహీనుడికి అలాంటి బెదిరింపులకు భయపడటం మామూలే. కానీ.. కొన్నిసార్లు బలవంతుడి బెదిరింపులకు బలహీనుడు భయపడకుండా ప్రశ్నిస్తారు. అలాంటప్పుడు కొత్త చరిత్ర తెర మీదకు వస్తుంది. ట్రంప్ తీరుకు మోడీ వ్యవహరిస్తున్న తీరు ఇంతకాలం కాస్త కన్ఫ్యూజన్ కు గురి చేయగా.. తాజాగా బయటకు వస్తున్న అంశాలు ఇప్పుడు ఆయన ఇమేజ్ అంతకంతకూ పెరిగిపో యేలా చేస్తోంది. త్వరలో మోడీ జరిపే చైనా పర్యటన.. రష్యాతో మరింత మైత్రిబంధాన్ని బలపర్చుకోవటం లాంటి అంశాల్ని పరిగణలోకి తీసుకుంటే.. అగ్రరాజ్య అధినేత ట్రంప్ మొండితనానికి మోడీ తనదైన మౌనంతో వ్యూహా త్మకంగా వ్యవహరించి దిమ్మ తిరిగే షాక్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లుగా కనిపిస్తోంది. అగ్రరాజ్య అధినేతగా అత్యంత శక్తివంతుడైన ట్రంప్ ను ప్రశ్నిం చటమే పెద్ద సాహసం. అలాంటి సాహసాన్ని ఇప్పటికే పూర్తి చేసిన మోడీ.. ట్ర ంప్ తెంపరితాన్ని.. భారత్ పట్ల ఆయన కక్కుతున్న వ్యతిరేక విషాన్ని సరైన రీతిలో నిలువరిస్తూ.. కొత్త జట్టు కట్టే దిశగా అడుగులు వేయటం.. అదే సమయంలో తాను చేస్తున్నది గొప్ప పనో.. అమెరికాకు వ్యతిరేకమనో అన్నట్లు కాకుండా.. ట్రంప్ తీరును..అతగాడి అహంకారాన్ని ప్రశ్నించే ధోరణి.. ప్రపంచా నికి కొత్త హీరో అన్న ఇమేజ్ ను మోడీకి తెచ్చి పెడుతుందని మాత్రం చెప్పకతప్పదు.

# ట్రంపరితనంను ఎదురించాల్సిందే !



న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

### సెలవులతో గ్రామాలకు జనాలు

హైదరాబాద్, ఈ నెల 9వ తేదీ శనివారం రాఖీ పండుగ నేపథ్యంలో అక్కాచెల్లెళు తమ సోదరుల వద్దకు వెళ్లేందుకు పయనమయ్యారు. దీంతో ఆడబిడ్డలందరూ ఆయా బస్టాండ్లకు చేరుకుంటున్నారు. కానీ సరిపడా బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో జిల్లాలకు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. కానీ బస్సులు సమయానికి రాకపోవడంతో ఆర్టీసీ అధికారులపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు. పండుగల వేళ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు- చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. శ్రావణ శుక్రవారం, రేపు రాఖీ పండుగ, ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు కూడా తమ సొంతూర్లకు వెళ్లేందుకు బస్టాండ్లకు చేరుకోవడంతో ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

## ఉజ్వల్ యోజనకు సబ్సిడీ కొనసాగింపు

న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపనీలకుకు 30 వేల కోట్ల సబ్సిడీని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దేశీయ ఎల్ పీజీ అమ్మకాలపై కంపెనీలకు కలిగే నష్టాలను భర్తీ చేయడానికి ఈ సబ్సిడీని ఉద్దేశించారు. దీనిని 12 భాగాలుగా చెల్లిస్తారు. 2025-26 ఆర్థికసంవత్సరానికి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వినియోగదారులకు రూ. 12 వేల సబ్సీడీని కొనసాగించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. భారతదేశం అంతటా శుభ్రమైన వంట గ్యాస్ నిరంతరం వినియోగించుకునేలా ప్రోత్సహించడం ద్వారా లబ్దిదారులకు ఎల్ పిజి కనెక్షన్లు మరింత చౌకగా అందించడమే ఈ సబ్సిడీ లక్ష్యం. మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు సబ్సిడీలను అందించనున్నట్లు- పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ తెలిపింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసిఎల్) భారత పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ( హెచ్ పిసిఎల్) మధ్య పంపిణీ చేస్తుంది. అంతర్జాతీయంగా చమురు ధరల్లో మార్పుల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడం, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు మద్దతు ఇవ్వడం ఈ నిర్ణయం లక్ష్యం అని కేబినెట్ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. చమురు, గ్యాస్ రంగాల్లో అనిశ్చితి కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. మధ్యతరగతికి వంటగ్యాస్ అందుబాటులో ఉండేలా చూడడం కోసం, రూ.30 వేల కోట్ల సబ్సిడీ ఆమోదించినట్లు- తెలిపారు అశ్విని వైష్ణవ్ .ప్రధాన్ మంత్రి ఉజ్వల్ యోజన (పిఎంయువై) 2016 మే లో ప్రారంభమైంది. భారతదేశం అంతటా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వయోజన మహిళలకు డిపాజిట్ లు లేకుండా ఎల్ పిజి కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యంగా సాగుతోంది. 2025 జూలై 1 నాటికి దేశవ్యాప్తంగా 10కోట్ల 33 లక్షల ఎంఎంయువై కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉజ్వల యోజన సబ్సిడీ కొనసాగించడం వల్ల వినియోగదారుడు ఎటు-వంటి డిపాజిట్ లేకుండానే ఎల్ పిజి కనెక్షన్ అందుకుంటాడు. అంతేకాదు, సిలెండర్, ప్రెషర్ రెగ్యులేటర్, సేఫ్టీ హోస్, డమొస్టిక్ గ్యాస్ కన్స్యూమర్ కార్డు బుక్ లెట్ అందించడంతో పాటు- ఇన్‌స్టలేషన్ చార్జీలకోసం సెక్యూరిటీ- డిపాజిట్ ను కవర్ చేస్తుంది. ఉజ్వల 2.0 పథకం కింద వినియోగదారుడు తన మొదటి స్టవ్, రీఫిల్ కూడా ఉచితంగా పొందుతారు. అంతర్జాతీయ ఎల్ పిజి ధరల అస్థిరత నుంచి ఉజ్వల్ యోజన వినియోగదారులను కాపాడేందుకు, క్రమబద్ధీకరించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2022 మేలో లక్ష సబ్సిడీని ప్రవేశపెట్టింది. సంవత్సరానికి 12 రీఫిల్ లకు 14.2 కిలోల సిలెండన్ ను కేవలం 200 రూపాయలకే అందిస్తుంది. ఈ సబ్సిడీని 2023 అక్టోబర్ లో రూ.300 కు పెంచారు. ఉజ్వల యోజన లబ్దిదారులలో ఎల్ పిజి సగటు- తలసరి వినియోగం (పిసిసి) క్రమంగా పెరిగింది. 2019-20లో మూడు రీఫిళ్లనుంచి 2022.23లో సగటు- వినియోగం 3.68 కి పెరిగింది. 2024-25లో సుమారు 4.47 రీఫిల్ లకు చేరింది. ఇది వంటగ్యాస్ వినియోగంలో మహిళలు చూపుతున్న శ్రద్ధను ప్రతిబింబిస్తోంది.

## ఆదాయపు పన్ను చట్టంపై పునరాలోచన

న్యూఢిల్లీ,ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు సిద్ధమైన కేంద్రం ఆదాయపు పన్ను నూతన బిల్లు 2025ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే, ఈ బిల్లును తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. దీన్ని అప్‌డేట్ చేసి మళ్లీ పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు- సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరి 13న కేంద్రం లోక్‌సభ లో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ-కి పంపించారు. ఈ కమిటీ- దీన్ని అధ్యయనం చేసి జులై 21న తమ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. మొత్తం 4500 పేజీలతో కూడిన ఈ నివేదికలో ముసాయిదా బిల్లుకు 285 ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. దానికి అనుగుణంగా కొత్త బిల్లును రూపొందించేందుకు సిద్ధమైంది. ఈ అప్‌డేటెడ్ బిల్లును ఆగస్టు 11న లోక్‌సభ ముందుకు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు- సమాచారం. నూతన ఆదాయపు పన్ను బిల్లుకు సెలెక్ట్ కమిటీ- కొన్ని ప్రధాన సూచనలు చేసింది. ముఖ్యంగా ఇంటిపై ఆదాయం పొందుతున్న వారికి ఉపశమనం కలిగేలా కొన్ని ప్రతిపాదనలు సూచించినట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం గృహ రుణ వడ్డీతో పన్ను మినహాయింపు ప్రయోజనాలు కేవలం సొంతింట్లో ఉంటున్న వారికి మాత్రమే వర్తిస్తున్నాయి. అలా కాకుండా సొంతింటిని అద్దెకు ఇచ్చిన సందర్భాల్లోనూ వడ్డీతో పన్ను మినహాయింపు కల్పించాలని కమిటీ- సూచించినట్లు- సమాచారం. ఇక, టీడీఎస్, టీసీఎస్ రీఫండ్లను కూడా సరళతరం చేయాలని కమిటీ- ప్రతిపాదనలు చేసింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు- కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు.

### తల్లీకూతరు దారుహత్య..జనగామ జిల్లాలో ...

జనగామ,జనగామ జిల్లా, జఫర్‌గడ్ మండలం, తమ్మడపల్లిలో తల్లీకూతురు గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. అందరితోను కలివిడిగా ఉండే వారు హఠాత్తుగా హత్యకు గురికావడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది. తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన గాలి రాణమ్మ (60), ఆమె తల్లి తుమ్మ అన్నమ్మ (90) ఇద్దరు గుర్తు తెలియని దుండగుల చేతిలో గురువారం రాత్రి హత్యకు గురయ్యారు. ఇంట్లో నిద్రిస్తున్న వారిద్దరిని నిద్రలేపిన దుండగులు హత్య చేసి, అక్కడి నుండి పారిపోయారు. శుక్రవారం ఉదయం ఈ హత్యోదంతం వెలుగు చూసింది. తమ్మడపల్లి (ఐ)కి చెందిన గాలి జార్జిరెడ్డి మొదటి భార్య సుందరి. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుందరి అనారోగ్యంతో మృతి చెందిన అనంతరం జార్జిరెడ్డి దేవరుప్పుల మండలం, నీర్మాలకు చెందిన తన భార్య స్వంత సోదరి రాణమ్మను రెండో భార్యగా వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. జార్జిరెడ్డి 25 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. దీంతో గ్రామంలో ఒంటరిగా ఉంటున్న రాణమ్మ తన తండ్రి మృతి చెందడంతో తల్లి అన్నమ్మను తమ్మడపల్లి (ఐ)కి తీసుకువచ్చి పోషించుకుంటోంది. గత ఏడేళ్లుగా ఇద్దరూ కలిసి ఉంటు-న్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తల్లీకూతురు గుర్తు తెలియని దుండగుల చేతిలో హత్యకు గురికావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట్ ఎసిపి అంబటి నర్సయ్య, సిఐ శ్రీనివాస్

# జగన్‌ను ఇరికించిన చెవిరెడ్డి?



అమరావతి, మద్యం కుంభకోణంతో నాకు సంబంధం లేదు.. నా కుటుంబ సభ్యులను ఇద్దరిని మద్యం వల్ల కొల్పోయాను..అలాంటి నేను మద్యం వ్యాపారానికి దూరం .. దాని వల్ల వచ్చే ఆదాయానికి కక్కుర్తి పడతానా అని.. పెద్దపెద్ద కబుర్లు చెప్పారు వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అయితే చెవిరెడ్డికి షాక్ కలిగించే వీడియోలు రీలీజ్ చేసి మద్యం కుంభకోణంలో ఆయన అనుయానులదే కీలక పాత్ర అని అంటున్నారు సిట్ అధికారులు.. తాజాగా చెవిరెడ్డి సన్నిహితుడు అయిన వెంకటేష్ నాయుడు విజువల్స్ బయటకు రావడంతో లిక్కర్ స్కాంలో వారి పాత్రపై అనుమానాలకు ఊతమిస్తున్నాయి.. సదరు వీడియోలతో చెవిరెడ్డితో పాటు మాజీ సీఎం జగన్ సైతం కేసుల్లో గట్టిగా ఇరుక్కోవడం ఖాయమంటున్నారు. అసలు ఆ కేసులో ఏం జరుగుతోంది?

చెవిరెడ్డి సన్నిహితుడైన చెరుకూరి వెంకటేష్ నాయుడు

ఉమ్మడి చిత్తూరు జిల్లా చంద్రగిరి వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి బాల్యస్నేహితుడు, హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారి.. అయిన చెరుకూరి వెంకటేష్ నాయుడికి చెవిరెడ్డి తో ఉన్న సన్నిహిత సంబంధాలతో వైసీపీలోని అగ్రనాయకులకు పరిచయం అయ్యాడు.. వెంకటేష్ నాయుడు మద్యం స్కామ్ లో కీలక సూత్రధారి అని సిట్ నిర్ధారించింది. అతన్ని ఏపీ లిక్కర్ స్కాంలో అరెస్ట్ చేసిన సిట్ ఏ 34 నిందితుడిగా చేర్చింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు వెంకటేష్ నాయుడు దేశం వదిలిపోతుండగా బెంగుళూరు విమానాశ్రయ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు సిట్ అదుపులోకి తీసుకుంది..అరెస్ట్ చేసినప్పటి నుంచి చెవిరెడ్డి సుభాషితాలు చెబుతున్నారు చెపుతున్నారు..మద్యం అంటే గిట్టదు..మద్యం కేసులో తమకు సంబందం లేదని అంటున్నారు. ఒక్కోసారి బెదరింపులు.. ఒక్కోసారి బేలగా మాట్లాడుతున్నారు. ఇటీవల కూడా ఇదే విషయాన్ని ఏసీబీ కోర్టుకు హాజరైనప్పుడు కూడా.. లిక్కర్ అంటే తనకు ఎలర్జీ అన్నట్లు శుద్ధపూసలా మాట్లాడారు..

వైసీపీ, బీఆర్ఎస్‌లకు ఆప్తుడిగా వ్యవహరించిన చెవిరెడ్డి

వైసీపీతో పాటు బీఆర్ఎస్‌కు అత్యంత ఆప్తుడిగా పనిచేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గత ఎన్నికల సమయంలో ఆ పార్టీలకు తన సొంత టీమ్‌లతో సర్వేలు కూడా చేయించారు.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు అప్పట్లో ఆప్తుడైన చెవిరెడ్డి అక్కడా, ఇక్కడా వ్యాపార దందాలు కొనసాగించారంట.. ఆయన తరుపున రియల్ ఎస్టేట్ వ్యవహారాలను హైదరాబాద్ లో వెంకటేష్ నాయుడు చక్కదిద్దే వాడని అంటున్నారు.. దానికితోడు తాడేపల్లి జగన్ నివాసంలో 2022 జగన్ నివాసంలో సంక్రాంతి నాడు తిరుమల దేవస్థానం సెట్టింగ్ వేసి సంబరాలు నిర్వహించారు..ఈసంబరాలలో కూడా వెంకటేష్ కీలక పాత్ర వహించాడంట. దానికి సంబంధించి జగన్‌తో సన్నిహితంగా ఉన్న ఫోటోలను వెంకటేష్ తన ఫేస్ బుక్ పోస్టుల్లో పేస్ట్ చేశాడు..

వెంకటేష్ వీడియోలతో బిత్తరపోతున్న వైసీపీ నేతలు

అందులో వైసిపి నాయకులందరితోను వెంకటేష్ సన్నిహితంగా ఉన్న పోటోలు ఉన్నాయి.. చివరకు లక్ష్మి పార్వతి పోటోలతో సహా ఉండటం గమనార్హం.. తిరుమల శ్రీవారి దర్శనానికి సైతం వెంకటేష్ మంది మార్బలంతో వచ్చినప్పుడు అక్కడ అధికారులు రాచమర్యాదుల చేసేవారంట.. ఆయా సందర్భాల్లో చెవిరెడ్డికి ఆత్మగా వెంకటేష్ నాయుడు కీలకంగా వ్యవహారించాడని అంటున్నారు.. రెండు రోజుల క్రితం వ్యక్తిగత కక్షతోనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కాలేజి రోజుల్లో చంద్రబాబుకి ఉన్న గొడవలను మనుషులో పెట్టుకుని మిథున్ రెడ్డిని అక్రమంగా కేసులలో ఇరికించారని మాజీ సీఎం జగన్ ఆరోపించారు. దానికి బదులుగా వెంకటేష్ వీడియోలు దిమ్మతిరిగే విదంగా ఉన్నాయని అంటున్నారు.

జగన్ లండన్ పర్యటనలో కలిసిన వెంకటేష్

ముఖ్యంగా జగన్ లండన్ పర్యటనలో వెంకటేష్ నాయుడు అయనను అక్కడ కలుసుకున్నట్లు కూడా ఫోటోలు బహిర్గతమ్యాయి.. ఆ సమయంలో జగన్ అర్ధిక వ్యవహారాలను వెంకటేష్ టీమ్ పర్యవేక్షించారని అంటున్నారు.. దీనికితోడు తన ఇంటినే మద్యం డబ్బు ఉంచడానికి డెన్ గా ఉంచారని ఆరోపణలు వెలుగు చూస్తున్నాయి ..అయితే ఎన్నికల కమీషన్ నోటిఫికేషన్ లో నంద్యాల వెంకటేష్ నాయుడు అడ్రస్ చూపిస్తుంది.. మిగతా ఎక్కడా కనిపించడం లేదు.. మొత్తం మీద చెవిరెడ్డితో పాటు వైసిసి నేతలకు దిమ్మ తిరిగే విధంగా వెంకటేష్ వీడియోలు బహిర్గతం అవుతుండటం కలకలం రేపుతోంది.

వైసీపీ, బీఆర్ఎస్ నేతలతో వెంకటేష్‌కు సన్నిహిత సంబంధాలు

ఏపి వైసిపి నాయకులకే కాదు తెలంగాణ బిఆర్ఎస్ నాయకులతో కూడా వెంకటేష్ నాయుడు సన్నిహిత సంబందాలు కలిగిఉన్నాడని అంటున్నారు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ కు సంబంధించి జాతీయ పత్రికలో సైతం వెంకటేష్ నాయుడు 10లక్షల వ్యయంతో యాడ్ వేసాడు.. దీంతో పాటు రెగ్యులర్‌గా కేటీఆర్ తో టచ్ లో ఉండటమే కాకుండా చెవిరెడ్డి సర్వే బృందానికి తెలంగాణ , ఏపిల్లో అవసరమైన నిధుల వ్యవహారం చూసేవాడని సిట్ దర్యాప్తులో బయటపడిందంట.. మొత్తం మీద మద్యం స్కామ్‌లో తనను కుట్రతో ఇరికించారని చెబుతున్న చెవిరెడ్డికి షాక్ తగిలేలా వెంకటేష్ నాయుడు వీడియోలు బయటకు రావడం ఇప్పుడు సంచలనంగా మారింది.. మరి దీనిపై చెవిరెడ్డి పత్తిత్తు కబుర్లు ఏం చెపుతారో చూడాలి.

# హైదరాబాద్‌కు భారీ వర్షాల భయం పోతుందా? సీఎం రేవంత్ రెడ్డి కొత్త ప్రణాళిక ఇదే!



హైదరాబాద్, హైదరాబాద్‌లో ఒక్కసారిగా కురిసే భారీ వర్షాలు, రోడ్లు నదుల్లా మారడం, లోతట్టు ప్రాంతాలు ముంపులో మునగడం.. ఇవన్నీ ప్రతి మాన్సూన్ సీజన్‌లో పునరావృతమవుతున్నాయి. కానీ, ఇకపై నగరానికి ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక భారీ మిషన్ ప్రారంభించబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ప్రణాళికకు నాయకత్వం వహిస్తూ, ఇప్పటి పనులు ఈ తరం కోసం మాత్రమే కాదు, వచ్చే వందేళ్ల తరాల కోసం అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు.

భారీ వర్షాల బీభత్సం.. నగరానికి ముందస్తు హెచ్చరిక

ఇటీవల హైదరాబాద్‌లో ఒకే రాత్రిలో 15 సెంటీమీటర్ల వర్షం పడింది. తక్కువ సమయంలో కురిసిన ఈ వర్షం రోడ్లను ముంచేసి, ట్రాఫిక్‌ను స్తంభింపజేసింది. లోతట్టు ప్రాంతాల్లోని వందలాది ఇళ్లు నీట మునిగాయి. ఈ పరిస్థితులు వాతావరణ మార్పుల వల్ల మరింత తీవ్రం అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా మూడు నెలల్లో పడే వర్షం ఇప్పుడు ఒకే రోజులో పడుతోంది. దీనిని తట్టుకునే శాశ్వత పరిష్కారం కోసం సీఎం ఆదేశాలు జారీ చేశారు.

వ్యవస్థల పూర్తి 'ప్రక్షాళన' ఆదేశం

ప్రస్తుతం నగరంలోని రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షాన్ని కూడా భరించలేవు. కానీ ఇప్పుడు ఒక్కసారిగా 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదవుతోంది. ఈ నేపథ్యంలో తాగునీరు, వరదనీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వంటి అన్ని వ్యవస్థలను పూర్తిగా అప్‌డేట్ చేసి, వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్.. ప్రధాన ఆయుధం

హైదరాబాద్‌లో వరద సమస్యకు మూసీ పునరుజ్జీవనమే శాశ్వత పరిష్కారం అని సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ కింద 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించనున్నారు. హుస్సేన్‌సాగర్, దుర్గం చెరువు, మీర్ అలం చెరువు వంటి ప్రధాన జలాశయాలను నాలాల ద్వారా మూసీతో అనుసంధానం, నాలాల వెడల్పు ప్రక్రియ వేగవంతం చేయడం, కలుషిత నీటి ప్రవాహాన్ని పూర్తిగా ఆపి, శుద్ధి చేసిన నీరు మాత్రమే మూసీకి చేరేలా సిస్టమ్ అమలు, ఈ చర్యలు పూర్తయితే నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపు సమస్య నుండి పూర్తిగా బయటపడతాయి.

చెరువుల పునరుద్ధరణ – వరద నీటి నిల్వ భద్రత

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్‌తో పాటు నగరంలోని చెరువులు, కుంటలను కూడా పునరుద్ధరించనున్నారు. హుస్సేన్‌సాగర్, దుర్గం చెరువు, మీర్ అలం చెరువుతో పాటు చిన్నచిన్న చెరువులు కూడా నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయబడతాయి. దీనివల్ల వర్షపు నీరు నేరుగా కాలనీల్లోకి చేరకుండా, చెరువుల ద్వారా నిల్వవుతుంది.

వందేళ్ల వరద రక్షణ వ్యూహం

ఎంత వర్షం పడినా, గ్రేటర్ హైదరాబాద్‌లో నీరు నిల్వ కాకూడదు, లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురి కాకూడదని సిఎం అన్నారు. దీనికోసం ఆధునిక డ్రైనేజ్ నెట్‌వర్క్, చెరువుల అనుసంధానం, మూసీ పరిరక్షణ, మరియు సముద్ర మట్టానికి సరిపడే ఇంజనీరింగ్ సొల్యూషన్లు ఉపయోగించబడతాయి.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత చెక్

వర్షాల సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోందని గుర్తించిన సీఎం, ముఖ్యంగా పాతనగరంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో పెడిస్ట్రియన్ జోన్ ఏర్పాటు చేయాలన్నారు. మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్‌లతో పార్కింగ్ సమస్యకు పరిష్కారం, వర్షాకాలంలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు.

పజల భద్రత.. ప్రథమ ప్రాధాన్యం

వర్షాలు, వరదల సమయంలో నగరవాసుల ప్రాణాలు, ఆస్తులు సురక్షితంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం విపత్తు నిర్వహణ విభాగం, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, వాటర్ బోర్డు వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

మహానగరానికి కొత్త శకం

ఈ ప్రాజెక్టులు పూర్తయితే హైదరాబాద్ ఇకపై భారీ వర్షాలు కురిసినా ముంపుకు గురి కాని నగరంగా మారుతుంది. ట్రాఫిక్, వరద నీటి సమస్యలు తగ్గి, పర్యావరణానికి హాని లేకుండా అభివృద్ధి జరగనుంది. ముఖ్యమంత్రి చెబుతున్నట్టే.. ఈ ప్రాజెక్ట్ మన పిల్లలకు, మన మనవళ్ళకు సురక్షితమైన హైదరాబాద్‌ను బహుమతిగా ఇస్తుందని చెప్పవచ్చు.

# మోదీ దెబ్బ.. ఇది ట్రంప్ రాయబారమా?

న్యూఢిల్లీ,అమెరికా విషయంలో ఏదైతే అది అయ్యిందనే నిర్ణయానికొచ్చింది భారత్. ఇప్పటిరకూ అమెరికాతో సంబంధాలపై ఆచితూచి అడుగులేసిన భారత్.. ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి రష్యాతో వాణిజ్య ఒప్పందానికే ఓకే చెప్పింది.గత కొంతకాలంగా ట్రంప్ విధించే సుంకాలపై సహనంగా ఉన్న భారత్.. అమెరికా ఆయుధాల కొనుగోలుకు తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. 'రోజూ భయపడుతూ కూర్చుంటే ట్రంప్ ఏదొక నిర్ణయంతో ఇరకాటంలో పెడుతూనే ఉంటారని నిర్ణయానికి ముగింపు పలకాలనే ఉద్దేశంతో భారత్.. ఎట్టకేలకు స్పందించింది. ఎంత సుంకాన్ని అయినా భరిస్తామని, అయితే రష్యాతో వాణిజ్య ఒప్పందం విషయంలో రాజీ పడేది లేదనే సంకేతాలు పంపింది.ఇప్పటివరకూ అమెరికాను మిత్రదేశంగా భావించిన భారత్.. ఉపయోగం లేని మిత్రత్వం అవసరం లేదనే విషయాన్ని యూఎస్‌కు అర్థమయ్యేలా చెప్పేసింది. తర్వాత పరిస్థితులు ఎలా ఉన్నా. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు తాము లొంగమనే విషయాన్ని తేటతెల్లం చేసింది.

నెతాన్యాహూ భారత్ పర్యటన..?

అమెరికా–భారత్‌ల మిత్రత్వం దాదాపు చెడిందనే సంకేతాల నడుమ ఇజ్రాయిల్ రంగంలోకి దిగింది. ఇజ్రాయిల్ ప్రధాని నెతాన్యాహూ భారత్ పర్యటనకు రాబోతున్నట్లు తెలుస్తోంది. భారత పర్యటనలో నెతాన్యాహూ మోదీని కలిసి ఓ సలహా ఇవ్వనున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.మరి ఆ సలహా ఏమిటనేది పక్కన పెడితే.. డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడైన నెతాన్యాహూ భారత్‌కు ఎందుకు రానున్నారనే చర్చ నడుస్తోంది. ఇది అమెరికా ఆడుతున్న డ్రామాగా ఉందని మరొక వాదన వినిపిస్తోంది. అమెరికాతో వాణిజ్య సంబంధాలను తాత్కాలికంగా పక్కన పెట్టిన భారత్‌ను ఒప్పించేందుకు నెతాన్యాహూను ట్రంప్ రాయబారిగా పంపడానికి సిద్ధమయ్యారనే వాదన తెరపైకి వచ్చింది.ప్రత్యేకంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేసి మోదీ మాట్లాడటం, అమెరికా ఆయుధాలను, వైమానిక క్షిపణులకు కొనుగోలుపై భారత్ విముఖత వ్యక్తం చేసిన తరుణంలో నెతాన్యాహూ ఆ దిశగానే మోదీతో మాట్లాడేందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా అనేది భారత్‌కు అతిపెద్ద మార్కెట్ అనే అంశం అందరికి తెలిసిందే. ఆటువంటి తరుణంలో కూడా భారత్.. అమెరికాతో రాజీ పడేందుకు సిద్ధంగా



లేకపోవడంతో నెతాన్యాహూను ట్రంప్ రంగంలోకి దింపే ఆలోచన కూడా చేసి ఉండొచ్చు.ట్రంప్ అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకుంటారనే విమర్శ కూడా ఆయనపై ఉంది. అగ్రరాజ్యం అమెరికా అనేది మినహాయిస్తే ఇక్కడ ట్రంప్ గొప్పతనం ఏమీ లేదు. తాము చెప్పినట్లు 'ఆడాలని' ట్రంప్ అనుకుంటూ ఉంటారని, అది అన్ని దేశాలతో కుదరదనే విషయం భారత్ చెప్పకనే చెప్పేసింది.. ఇప్పుడు భారత్, రష్యా, చైనాల మైత్రితో అమెరికాకు గుండెల్లో రాయి పడినట్లే ఉంది.మూడు అగ్రదేశాలు ఏకం అవుతున్న తరుణంలో డొనాల్డ్ ట్రంప్‌ను కాస్త ఇరకాటంలో పడేసినట్లే ఉంది. ఎప్పుడూ భారత్‌కు వ్యతిరేకంగా ఉండే చైనా కూడా, ఇప్పుడు ట్రంప్ బెదిరింపులను తట్టుకోలేకపోతోంది. మన మంచిని కోరలేని శత్రువుకు అంగుళం చోటిస్తే మొత్తం ఆక్రమిస్తారంటూ ట్రంప్ వైఖరిని తీవ్రంగా తప్పుపట్టింది.ఈ అన్ని అంశాలను బేరీజు వేసుకున్న ట్రంప్.. నెతాన్యాహూను అనధికార రాయబారిగా పంపుతున్నారా? అనేది ఇప్పుడు చర్చకు దారి తీసింది. ఒకవేళ నెతాన్యాహూ భారత్ పర్యటనకు వస్తే మాత్రం, కచ్చితంగా అమెరికాతో భారత్ సంబంధాలపై మాట్లాడి రాజీ కుదిర్చే అవకాశాల్ని కూడా కొట్టిపారేయలేం. ఇంకా భారత్–అమరికాల బంధం చాలా బలంగా ఉందని స్వయంగా నెతాన్యాహూ చెప్పిన తరుణంలో.. ఆ దిశగానే పావులు కదిపే అవకాశం ఉంది.

# సొంత చెల్లెళ్లే రాఖీలు కట్టని నేతలు – ఎలా ఆదర్శం !?



హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో ఇద్దరు యువనాయకుల పరిస్థితి ఇంట్లో ఈగల మోత..బయట పల్లకీలో మోత అన్నట్లుగా మారింది. సొంత చెల్లెళ్లు రాఖీలు కట్టేందుకు సిద్ధంగా ఉండరు కానీ..బయట నుంచి ఇతరులు మాత్రం వచ్చి .. మా అన్న మహానుభావుడు అని రాఖీలు కట్టేస్తూ ఉంటారు. సొంత చెల్లికే న్యాయం చేయని వాడు బయట వారికేం చేస్తూంటారని వారి ప్రత్యర్థులు విమర్శలు చేస్తూంటారు. ఈ సమస్యను వారు తెలివిగా పరిష్కరించుకోలేక రోడ్డుపై పడిపోతున్నారు. ఫలితంగా ఈ అన్నల ఇమేజ్ మసకబారిపోతోంది.

సొంత మీడియాలోనూ చెల్లెళ్లకు చోటు లేదు !

రాఖీ పండుగ వస్తే సొంత మీడియాలో అన్నాచెల్లెళ్ల ఆత్మీయత గురించి కుప్పలుకుప్పలుగా కథనాలు కనిపించేవి. ప్రతి పేజీలోనూ వారిద్దరి ఫోటోలు ఉండేవి. కానీ ఇప్పుడు ఎలాంటి అనుబంధాలు కనిపించడం లేదు. చెల్లి ఫోటోలు పత్రికల్లో, టీవీల్లో కనిపించకుండా బ్యాన్ చేసేశారు. ఇక సోషల్ మీడియాలో శుభాకాంక్షలు చెప్పే అవకాశం కూడా లేదు. కేటీఆర్ రాఖీ ముందు రోజు.. లగచర్ల నుంచి ఓ మహిళను పిలించుకుని రాఖీ కట్టించుకున్నారు. రాఖీ రోజు ఊళ్లో ఉండకూడదని నిర్ణయించుకున్నారు. జగన్ రెడ్డి కి రాఖీ కట్టడం కాదు కదా ఇప్పుడు ఆయన నీడ కూడా సహించేందుకు షర్మిల సిద్ధంగా లేరు.

ఏవీ నాటి అనుబంధాలు – అన్నీ ఫేకేనా ?

సాక్షి పత్రికలో అన్నీ బాగున్న రోజుల్లో జగన్, షర్మిల అనుబంధం గురించి వచ్చే కథనాలు చదివితే పాలకులకు కళ్లు చెమర్చుతాయి. జగన్ రెడ్డి కి చెల్లి అంటే అంత ఇష్టమా అని వైసీపీ క్యాడర్ అనుకునేవారు. కానీ అసలు అవన్నీ సాక్షిలో లక్షలకు లక్షలు జీతాలు ఇచ్చి చేయి తిరిగిన రచయితలతో రాయించుకున్న కాల్పనిక కథలు అని ఇప్పుడు అందరికీ క్లారిటీ వచ్చింది. అసలు జగన్ కు.. తల్లి, చెల్లి అనే సెంటిమెంట్ లేదని వారి పై ఆస్తుల కోసం కోర్టుకెళ్లినప్పుడే తేలిపోయింది. సోషల్ మీడియాలో వారి క్యారెక్టర్లపై నిందలు వేయడం.. చెల్లి చీర రంగు గురించి మాట్లాడినప్పుడే ఆయన ఎంత ఘోరమైన మనస్తత్వం ఏమిటో ప్రజలకు తేలిపోయింది. ఆయన రాఖీ పండుగ అంటే ఇప్పుడు అసహ్యించుకుంటారు.

రాజకీయ స్వార్థం కోసం కుటుంబ బంధాలను వదిలేసిన నేతలు

కేటీఆర్, జగన్ ఇద్దరూ రాజకీయ, ఆస్తుల స్వార్థాల కోసం సొంత సోదరీమణుల్ని వదిలేశారు. కవిత రాజకీయంగా తనకు ప్రాధాన్యత కోరుకున్నారు. కానీ తనకు అడ్డం ఉండకూడదని కేటీఆర్ అనుకుంటున్నారు. జగన్ రెడ్డి .. తనకోసం విపరీతంగా కష్టపడిన చెల్లికి చిన్న పదవి ఇవ్వలేదు. తండ్రి కి ఇచ్చిన మాట ప్రకారం అయినా ఆస్తులు పంచలేదు. ఇలాంటి వాటి కోసం చెల్లెళ్లను రోడ్డుపై పడేసిన అన్నలు మిగిలిన మహిళలందరికీ మేలు చేస్తామని.. వారికి గొప్ప అన్నగా ఉంటామని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రజలు .. ముఖ్యంగా మహిళలు ఎలా నమ్ముతారు ?

# కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులు గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్: తెలంగాణలోని రైతులు పండించిన పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మరింత వెసులుబాటు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో కొత్తగా 10 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి త్వరలో తుది ఉత్తర్వులను జారీ చేయనుంది. ఈ కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులను రాష్ట్రంలోని నాగర్కర్నూల్ జిల్లాలోని కోడేరు, పెద్దకొత్తపల్లి. వనపర్తి జిల్లాలోని పానగల్, వీవనగండ్ల, ఖిలాఘన్పూర్, గోపాల్పేట.పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి. నల్గొండ జిల్లాలోని దామరచర్ల. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని మత్కేపల్లి ఉన్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 197 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటికి అదనంగా మరో 10 మార్కెట్ యార్డులు ఏర్పాటు చేస్తూ సర్కార్ గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. ఈ కొత్త వ్యవసాయ మార్కెట్లు యార్డులు అందుబాటులోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా వాటి సంఖ్య 207కి చేరనుంది. ఈ కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో స్థలాలను సైతం గుర్తించినట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. వీటి ఏర్పాటుకు గాను ప్రాథమిక, తుది నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కానందున ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటితోపాటు మరో ఐదు మార్కెట్ యార్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి.

# బీఆర్ఎస్ సంచలన నిర్ణయం!

హైదరాబాద్,ఇప్పటికే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయ పోరాటం చేస్తున్న బీఆర్ఎస్.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ పార్టీ తరఫున మండలికి ఎన్నికై.. ఇప్పుడు అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయడం కోసం సుప్రీంకోర్టులో న్యాయ పోరాటానికి సిద్ధమైంది.ఇప్పటికే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ ఇప్పుడు ఎమ్మెల్సీలపై ఫోకస్ పెట్టింది. తమ పార్టీ తరఫున ఎమ్మెల్సీలుగా ఎన్నికై అధికార పార్టీలో చేరిన వారిని అనర్హులుగా గుర్తించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసేందుకు పార్టీ లీగల్ సెల్ తో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. సోమవారం సుప్రీంకోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆరుగురు ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ తరఫున ఎన్నికై కాంగ్రెస్ గూటికి చేరిపోయారు.కాంగ్రెస్‌లో చేరిన వారిలో బస్వరాజు సారయ్య, భాను ప్రసాద్ రావు, దండె విఠల్, ఎం.ఎస్. ప్రభాకర్, యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్ ఉన్నారు. ఇప్పటికే ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కు స్పష్టం చేసింది. దీంతో స్పీకర్ ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్సీలపై వేటు తప్పదని.. వారి స్థానాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ చెబుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 39 సీట్లకే పరిమితమై అధికారాన్ని కోల్పోయింది. అప్పటి నుంచి ఆ పార్టీకి కష్టాలు మొదలయ్యాయి. ఆ పార్టీ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు అధికార హస్తం పార్టీ లో చేరిపోయారు. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ నుంచి బరిలోకి దిగి ఎమ్మెల్యేగా విజయం సాధించిన దానం నాగేందర్ ఏకంగా




కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన కడియ శ్రీహరి కూడా హస్తం గూటికి చేరిపోయారు.ఆయన కూతురును వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించి గెలిపించుకున్నారు. వీరితో పాటు పటన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్సే పోచారం శ్రీనివాసరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా కాంగ్రెస్ లో చేరిపోయారు. ఇప్పుడు వీరందనిపై అనర్హత వేటు వేయించాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీ న్యాయ పోరాటం చేస్తోంది.

బనకచర్లపై సైతం న్యాయ పోరాటం..

మరో వైపు బనకచర్ల అంశంపై సైతం న్యాయం పోరాటం ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ డిసైడ్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ ఆధ్వర్యంలో బనకచర్లను ఆపాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com